టపాసుల వ్యాపారం తుస్సు

- రెండు రోజుల ముందు దుకాణాల కేటాయింపు
- అప్పటికే భారీ వర్షాలతో మైదానాల్లో నీరు
- పండుగ రోజూ వదలని వాన
- మునిగిపోయామంటున్న వ్యాపారులు

8







నెల్లూరు నగరంలో సోమవారం రాత్రి దీపావళి సందడి





రాజరాజేశ్వరి ఆలయం, మూలస్థానేశ్వర ఆలయాల్లో సామూహికంగా కేదారేశ్వర నోములు నోచుకుంటున్న భక్తులు

ఘనంగా దీపావళి

- వైష్ణవాలయాల్లో మహాలక్ష్మి పూజలు
- భక్తిశ్రద్ధలతో కేదారేశ్వర వ్రతం
- వరుణుడి కరుణ, మోతమోగిన బాణసంచా

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ప్రజలు దీపావళిని సోమవారం ఘనంగా నిర్వహించారు. వైష్ణవాలయాల్లో మహాలక్ష్మి పూజలు, శివాలయాల్లో కేదారేశ్వర వ్రతాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచుకున్నారు. ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సోమవారం ఉదయం భారీ వర్షం కురవగా. సాయంత్రానికి తెరపివ్వడంతో ప్రజలు తమ కుటుంబ సభ్యులతో కలిసి భారీగా బాణసంచా పేల్చారు.రాత్రి ఏడు నుంచి పదకొండు గంటల వరకు బాణసంచా పేలుళ్లతో నగరం దద్దరిల్లింది. మంగళవారం సాయంత్రం వరకు దీపావళి ఘడియలు ఉండడంతో ఆలయాల్లో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నగరంలోని మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామికి సోమవారం రాత్రి పేట ఉత్సవం వైభవంగా జరిగింది. దీపాలంకరణ, శివనామస్మరణలు జరిగాయి. రాజరాజేశ్వరి ఆలయంలో సుందరేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, నిర్వహించారు. తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో దీపావళి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీదేవి,భూదేవి సమేత రంగనాథస్వామికి తిరుమంజనం కనుల పండువగా జరిగింది. సాయంత్రం స్వామివారి పేట ఉత్సవం జరిగింది. ఈ కార్యక్రమాలను ఈవో ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.



మూలాపేటలో భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి పేట ఉత్సవం



మనుబోలులో జోరుగా పారుతున్న కండలేరు కాలువ



బుచ్చి : జొన్నవాడ వద్ద పెన్నానదిలో వరద ప్రవాహం

వీడని వాన

- ఆరు రోజులుగా కురుస్తున్న వాన
- జనజీవనం అస్తవ్యస్తం
- వాహనాల రాకపోకలకూ బ్రేక్
- పలుచోట్ల నేలవాలిన వరి
- నేలకూలిన చెట్లు, స్తంభాలు,
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- నేడు విద్యాలయాలకు సెలవు
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్
- 25 వరకు వర్షాలు కురిసే అవకాశం

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మంగళవారం జిల్లాలో జోరువాన కురిసింది. ఆరు రోజు ల నుంచి ఎడతెరిపి లేని వర్షంతో జనజీవనం అతాకుతలమైంది. భారీ వర్షంతో రోడ్లన్నీ జలమయ్యాయి. వర్షం మొదలైతే గంటల తరబడి కురుస్తోంది. ఆగిఆగి కురుస్తున్న వర్షంతో పనులు కాక జనం ఇబ్బందులు పడ్డారు. వాహన రాకపోకలకు అంతరాయం కలిగింది. ప్రాజెక్టులు, చెరువులు,వాగులు,వంకలు నీటితో కళకళలాడుతున్నాయి. ఈనెల 25 వరకు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావారణశాఖ తెలిసింది. కొడవలూరులో అత్యధికంగా 227మి.మీ, అత్యల్పంగా వరికుంటపాడులో 85.4 మి.మీ వర్షపాతం నమోదైంది. మంగళవారం ఒక్కరోజే సగటు వర్షపాతం 25 మి.మీగా నమోదైంది.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

భారీ వర్షాల నేపథ్యంలో రెవెన్యూ, పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ శంకరన్ హాల్లో భారీ వర్షాలపై మండల అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ యంత్రాంగం లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. తీర ప్రాంత ప్రజలు, మత్స్యకారులను అప్రమత్తం చేస్తూ, ఎవరూ సముద్రంలోకి వెళ్లకుండా హెచ్చరికలు జారీ చేయాలని కోరారు. కాగా నీటి మునిగిన పంట పొలాల వివరాలను సేకరంచి ప్రాథ మిక నివేదిక సిద్ధం చేయాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. ప్రజలకు అత్యవసర సేవలు అందించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామని తెలిపారు. వర్షాల వల్ల ఇబ్బందులు తలెత్తిన వారు 0861-2331261, 7995576699 నంబర్లకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. ఈనెల 25 వరకు కంట్రోల్ రూం పనిచేస్తుందని తెలిపారు.

నేడు పాఠశాలలు, కళాశాలలకు సెలవు

నెల్లూరు(విద్య) : భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాలతో బుధవారం జిల్లా వ్యాప్తంగా అన్నీ పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు డీఈవో డాక్టర్ ఆర్.బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్నీ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు కూడా బుధవారం సెలవు ప్రకటించాలని, ప్రభుత్వ ఆదేశాలను తప్పక పాటించాలన్నారు.

ఏఎస్‌పేటలో కూలిన చెట్లు

ఏఎస్‌పేట : మండలంలో మంగళవారం భారీగా వర్షం కురిసింది.దీంతో పోలీస్ స్టేషన్ సమీపంలో రోడ్డుకు అడ్డంగా చెట్టు కూలింది. అలాగే పలు చోట్ల చెట్లు రోడ్డుకు అడ్డంగా కూలి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.మంగళవారం కురిసిన వర్షంతో ఏఎస్ పేటతో పాటు పలు చోట్ల విద్యుత్‌కు అంతరాయం ఏర్పాడింది.



ఏఎస్ పేటలో రోడ్డుకు అడ్డంగా కూలిన వృక్షం

నిండుతున్న చెరువులు

మనుబోలు : మండలంలో జోరుగా కురవడం... అంతలోనే ఆగిపోవడం...సెకన్ల వ్యవధిలోనే మళ్లీ జల్లులు పడడం... ఇలా ఐదురోజులుగా వర్షం కురుస్తూనే ఉంది. నార్లు పోయక ముందే ఇలాంటి వర్షాలు, తుఫాన్‌లు వస్తే సాగుకు ఇబ్బందులు ఉండవని రైతులు అంటున్నారు. అల్పపీడనం ఏర్పడకముందే చెరువుల్లో నీరు సమృద్ధిగా ఉంది. కురుస్తున్న వర్షాలకు మండలపరిధిలోని జాతీయ రహదారి చాలాచోట్ల దెబ్బతింది.



బిట్రగుంట : కొండబిట్రగుంట గిరిజన కాలనీలో వర్షపునీరు



అనంతసాగరం మండలం పాతాళపల్లిలో వర్షపునీటిలో వరి చేలు

వరి పైరుకు నష్టం

చేజర్ల : కురుస్తున్న వర్షాలకు మండలంలోని కాకివాయిలో కోతకు వచ్చిన వరి నీటమునిగి గింజలు మొలకెత్తాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వంద ఎకరాలలో కోతకు వచ్చిన వరిపైరు నేలపాలు కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈవిషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు.

అనంతసాగరం: కురుస్తున్న వర్షం వల్ల మండలంలోని పలుగ్రామాల్లో వరిపైరు దెబ్బతింది. కోతకు వచ్చిన వరి నేలవాలడంతో పాటు పొలాల్లో వర్షపు నీరు చేరి రైతులు నష్టపోయారు. మండల వ్యవసాధికారి శైలజాకుమారి మంగళవారం పలుగ్రామాల్లో దెబ్బతిన్న వరిని పరిశీలించారు. పంట నష్టం అంచనాలు వేశామని, నివేదికను ఉన్నతాధికారులకు పంపుతానని తెలిపారు.

కావలి టీడీపీకి అండగా మాలేపాటి

- కష్టకాలంలో ఆదుకున్న నేతగా గుర్తింపు
- అకాల మరణంతో శోకసముద్రంలో అభిమానులు

కావలి, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి) కావలి నియోజకవర్గంలో టీడీపీ కష్టకాలంలో ఉన్న సమయంలో నేనున్నానంటూ మాలేపాటి సుబ్బానాయుడు ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టారు. ఆయన అకాలమరణం కార్యకర్తలను, అభిమానులకు శోకసముద్రంలో ముంచింది. 2019 ఎన్నికల్లో కావలి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి రాష్ట్రంలో పార్టీ ఓటమి అనంతరం, స్థానిక నేతల విభేదాల కారణంగా పార్టీకి దూరమయ్యారు. అప్పటినుంచి కావలికి నాయకుడు లేక పార్టీ క్యాడర్ చిన్నాభిన్నం అయింది. నియోజకవర్గ ఇన్‌చార్జి కోసం పలువురిని ప్రతిపాదించినా, అధికారంలో ఉన్న వైసీపీకి భయపడి ఎవరూ ముందుకు రాలేదు. చివరకు పార్టీ అధిస్టానం బీద రవిచంద్రకు బాధ్యతలు అప్పగించేందుకు సిద్ధమైనా ఆయనకూడా రాష్ట్రపార్టీకి సేవలు అందించాలని ముందుకు రాలేదు. చివరకు మాలేపాటి సుబ్బానాయుడు ముందుకు వచ్చి పార్టీ ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించారు.



ఈనెల 11న సీఎం చంద్రబాబుతో జరిగిన సమావేశంలో వ్యవసాయశాఖ ఉన్నతాధికారులతో కలిసి పాల్గొన్న మాలేపాటి సుబ్బానాయుడు(ఫైల్)

పార్టీకి నూతన ఉత్తేజం

అప్పటిదాకా నిస్తేజంలో ఉన్న కావలి టీడీపీలో మాలేపాటి నూతన ఉత్తేజాన్ని తీసుకువచ్చారు. 2022 నుంచి 24 వరకు పార్టీ ఇన్‌చార్జిగా కొనసాగుతూ వైసీపీ అవినీతి, అక్రమాలపై ఉక్కుపాదం మోపారు. టీడీపీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు. అమరావతి రైతుల పాదయాత్ర, యువనేత లోకేష్ చేపట్టిన యువగళంను నియోజకవర్గంలో విజయవంతం చేశారు. అయితే 2024 ఎన్నికల నాటికి సామాజిక వర్గాల సమీకరణలో భాగంగా ఆయనకు అధిష్ఠానం ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వలేదు. ఎన్నికల అనంతరం రాష్ట్ర ఆగ్రోఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చి ఆయనకు పార్టీ సముచిత స్థానం కల్పించింది. ఈ నెల11న అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబా బునాయుడు నిర్వహించిన ఉన్నతాధికారుల సమీక్షలో కూడా మాలేపాటి పాల్గొని వ్యవసాయాభివృద్ధికి సలహాలిచ్చా రు. అయితే అదే రోజు అమరావతిలోనే ఆయనకు బ్రెయిన్‌స్ట్రోక్ వ చ్చింది. దీంతో అక్కడే ఉన్న మణిపాల్ ఆసుపత్రిలో చేరి చికిత్స పొం దుతూ ఈ నెల 20వతేదీ తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. అనంతరం ఆయన స్వగ్రామమైన దగదర్తిలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహించారు. రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌లకు అధికార లాంఛనాలు లేకపోయినప్పటికి సుబ్బానాయుడి కోసం ప్రభుత్వం జీవో ఇచ్చి అధికారలాంఛనాలు కల్పించి ఆయన మరణానంతరం కూడా సముచిత స్థానం కల్పించింది.

సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

సుబ్బానాయుడి మృతిపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి వారిని ఓదార్చారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని తెలిపారు.

లోకేష్ సంతాపం

సుబ్బానాయుడి మృతికి రాష్ట్ర విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. పార్టీలో అంచలంచెలుగా ఎదిగిన సుబ్బానాయుడు కావలి నియోజకవర్గ ఇన్‌చార్జిగా పనిచేశారన్నారు. పార్టీ పటిష్ఠతకోసం, ప్రజల అభ్యున్నతికి ఆయన విశేషంగా కృషిచేసారని, ఆయన మరణం పార్టీకి తీరని లోటన్నారు.

మూగబోయిన దగదర్తి

దగదర్తి (బిట్రగుంట), అక్టోబరు 21: సేవచేసే నేతల వెంటే జనం ఎప్పుడూ ఉంటారని మాలేపాటి కుటుంబీకులు నిరూపించారు.ఆ కుటుంబంలో ఇద్దరు నేతలు వెంట వెంటనే మృతి చెందడంతో దగదర్తి మండలం మూగబోయింది. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఏపీ ఆగ్రో ఇండస్ట్రీసస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు (60) అనారోగ్యంతో సోమవారం తెల్లవారు జామున మృతి చెందారు. సుబ్బానాయుడు అన్న ఇరిగేషన్ బోర్డు మాజీ డైరెక్టర్ మాలేపాటి రవీంద్రనాయుడు చిన్నకుమారుడు, టీడీపీ యువనేత మాలేపాటి భానుచందర్‌నాయుడు ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో ఆ కు టుంబం శోకసముద్రంలో మునిగింది. సోమవారం ఉదయం భానుచందర్ అంత్యక్రియలకు సిద్ధమవుతున్న సమయంలో సుబ్బానాయుడు మృతి చెం దాడని తెలియడం మాలేపాటి కుటుంబాన్ని మరింత కుంగదీసింది. దగద ర్తి మండలం సున్నపుబట్టి జాతీయ రహదారి నుంచి మాలేపాటి కుటుం బ అభిమానులు, టీడీపీ కార్యకర్తలు భారీగా తరలివెళ్లి సుబ్బానాయుడు పార్థివదేహాన్ని స్వగృహం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆయన అంత్యక్రియలకు ప్రభుత్వ ప్రతినిధులుగా సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, కలెక్టర్ హిమాన్షు శుక్లా హాజరై ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఉదయగిరి, కందుకూరు ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, ఇంటూరి నాగేశ్వరరావు, పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు మాలేపాటి మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులు అర్పించారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- సంస్మరణ దినోత్సవంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా
- నగరంలో భారీ ర్యాలీ

నెల్లూరు(క్రైం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రజల భద్రతే లక్ష్యంగా విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. పోలీసు పరేడ్ మైదానంలో మంగళవారం అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల ఆధ్వర్యంగా ఘనంగా నిర్వహించారు. తొలుత అమరవీరుల స్తూపం వద్ద విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులకు కలెక్టర్, ఎస్పీ, అమరవీరుల కుటుంబ సభ్యులు ఘన నివాళులు అర్పించారు. అనంతరం అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున చెక్కులు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1959 అక్టోబరు 21న జమ్మూ కశ్మీర్‌లోని హిమాలయ పర్వత శ్రేణుల్లో మనదేశ పరిహద్దు అయిన లడాక్ భూభాగంలోకి చైనా దురాక్రమణకు పాల్పడిన సమయంలో వీరోచితంగా పోరాడి అసువులు బాసిన వీరజవాన్లకు నివాళిగా ప్రతి ఏటా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. 2024 సెప్టెంబరు 1 నుంచి 2025 అక్టోబరు 1 వరకు దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో 191 మంది పోలీసులు ప్రాణత్యాగం చేశారని, మన జిల్లాలో 10 మంది పోలీసులు ప్రాణాలు అర్పించారని వివరించారు. ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల మాట్లాడుతూ దేశం స్వేచ్ఛగా, స్వాతంత్రంగా ఉండటానికి పోలీసుల వీరోచిత పోరాటాలే కారణమన్నారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు ఎప్పుడూ భరోసాగా ఉంటామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎంటీవో హరిబాబు ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ అమరవీరుల సంస్మరణ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ పోలీసు పరేడ్ మైదానం నుంచి ఆర్టీసీ, కేవీఆర్ పెట్రోల్ బంకు మీదుగా పోలీసు మైదానం వరకు సాగింది. ర్యాలీలో కలెక్టర్, ఎస్పీ, ఏఎస్పీ సౌజన్య, డీఎస్పీలు, సీఐలు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





పోలీసు అమరవీరులకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ అజిత వేజెండ్ల, నగరంలో పోలీసుల ర్యాలీ

నేటి డిగ్రీ పరీక్షలు వాయిదా

వెంకటాచలం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : వీఎస్‌యూ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో బుధవారం జరగాల్సిన డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత ఓ ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాలు, వాతావరణ ప్రతికూల పరిస్థితుల దృష్ట్యా వీసీ అల్లం శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పరీక్షలను తాత్కాలికంగా వాయిదా వేశామన్నారు. మిగతా పరీక్షలు యథావిధిగా జరుగుతాయన్నారు. వాయిదా వేసిన పరీక్షలకు సంబంధించిన పునఃషెడ్యూల్‌ను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	130
స్కిన్ చికెన్	236
స్కిన్‌లెస్	260

కోడిగుడ్ల ధర (100) : 560

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.12340
వెండి కిలో ధర	రూ. 1,65,000
వెండి ఒక గ్రాము	రూ.171.00

సుబ్బానాయుడి మృతి తీరని లోటు : వేమిరెడ్డి దంపతులు

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : టీడీపీ సీనియర్ నాయకుడు, ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మాలెపాటి సుబ్బానాయుడి ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటని, ఆయన హఠాన్మరణం బాధాకరమని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దగదర్తి మండల అధ్యక్షుడిగా, కావలి నియోజకవర్గ ఇన్‌చార్జిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా టీడీపీకి ఆయన అందించిన సేవలు మరువలేనివని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు.

ఏబీవీపీ నాయకులపై కేసు నమోదు

నెల్లూరు రూరల్, అక్టోబరు 21,(ఆంధ్రజ్యోతి) : అల్లీపురం వద్దనున్న విశ్వం హైస్కూల్‌పై దాడికి పాల్పడిన ఏబీవీపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ గుంజి వేణు తెలిపారు. ఏబీవీపీ నాయకుడు మనీష్‌రెడ్డితోపాటు మరికొందరు మంగళవారం స్కూల్ ఆవరణలోకి ప్రవేశించి ఫీజుల విషయమై తనతో వాగ్వివాదానికి దిగారని, పాఠశాలలోని ఫర్నిచర్, తరగతి గదుల అద్దాలు ధ్వంసం చేశారని కరస్పాండెంట్ బాలకృష్ణ తమకు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఈ మేరకు ఏబీవీపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పాఠశాలపై దాడి అన్యాయం

నెల్లూరు(విద్య), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : అల్లీపురంలోని విశ్వం హైస్కూల్‌పై ఏబీవీపీ దాడి చేయడం అన్యాయమని అపస్మా రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షుడు నేతాజీ సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం పాఠశాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యార్థి సంఘాలు విద్యా సమస్యలపై పోరాడాలే తప్ప ఇలా దౌర్జన్యాలు చేయడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో అపస్మా జిల్లా అధ్యక్షుడు ఎన్ శ్రీధర్, కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, కోశాధికారి కృష్ణారావు, నగరాధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, కార్యదర్శి రమేష్ పలు పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

తెలుగు మహిళలకు చీరలు, స్వీట్లు

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 47వ డివిజన్‌లో మంగళవారం టీడీపీ మహిళా శక్తి బృందానికి చీరలు, హ్యాండ్ బ్యాగులు, స్వీట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు, డివిజన్ ఇన్‌చార్జి డాక్టర్ గణేష్ కుమార్, మాజీ కార్పొరేటర్ సుజాత వీటిని పంపిణీ చేశారు.

బాధ్యతా రహితంగా వైసీపీ : కర్నాటి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రతిపక్ష బాధ్యత తీసుకోకుండా బాధ్యతారహితంగా వ్యవహరిస్తోందని బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానెలిస్ట్ కర్నాటి ఆంజనేయరెడ్డి విమర్శించారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వ్యక్తులు అసెంబ్లీలో ప్రభుత్వ వైఫల్యాలపై చర్చించి ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రశ్నించాలే తప్ప ప్రతిపక్ష పార్టీ హోదా లేదని అసెంబ్లీకి రాకపోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో పాత్తు జిల్లా ప్రధాన కార్యదర్శి యాకసిరి ఫణిరాజు, మండల అధ్యక్షుడు అడపాల మదనసాయి పాల్గొన్నారు.

పోలీసుల త్యాగాలు వృథా కావు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట, ఆంధ్రజ్యోతి): అమరులైన పోలీసుల త్యాగాలు ఎన్నటికీ వృథా కావని బీజేపీ నాయకుడు మిడతల రమేష్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా మంగళవారం ఏసీబీ డీఎస్పీ రామకృష్ణుడును ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుధవరపు బాలాజీ, తాతారెడ్డి, మునీంద్ర, తదితరులు పాల్గొన్నారు.



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం, ఈశాన్య రుతుపవనాల కదలికలతో వాతావరణంలో ఏర్పడ్డ మార్పులు వేదగిరి క్షేత్రంపై అందమైన దృశ్యాన్ని ఆవిష్కరించాయి. నరసింహ కొండను దట్టమైన మేఘాలు కమ్ముకున్నాయి. ఇక్కడి పవన విద్యుత్ పరికరాలు మూడొంతులు కనిపించనంతగా మేఘాలు చుట్టుకుని ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేశాయి. - నెల్లూరు రూరల్(ఆంధ్రజ్యోతి)



నగరంలో సోమ వారం సాయంత్రం ఆకాశాన రెండు ఇంద్ర ధనుస్సులు ఏర్పడి చూపరులకు కనువిందు చేశాయి. ఒక ఇంద్రధనుస్సు కొంత సమయం తర్వాత కనుమరు గు అయినా మరో ఇంద్రధనుస్సు దాదాపు అర్ధగంట కుపైగా కనిపించడం విశేషం. కాగా, సోమ-మంగళవారాల్లో నగరంలో రోజంతా ఎడతెగని వర్షం కురిసింది. విడతల వారీగా భారీ జల్లులు కురవడంతో



రోడ్లు, లోతట్టు ప్రాం తాలు జలమయం అయ్యాయి. ఈ వర్షాలకు సంతపేటలోని ఆంజనేయ స్వామి గుడి వీధిలో భారీ చెట్టు సోమవారం మధ్యాహ్నం కూలి పక్కనే ఉన్న సాయిబాబా మందిరంపై పడింది. ఆ మందిరం పాక్షికంగా దెబ్బతినడంతో బాబా భక్తులు ఆవేదన చెందారు. - నెల్లూరు (సాంస్కృతికం,ఆంధ్రజ్యోతి)

మున్సిపల్ కార్మికులతో సహపంక్తి భోజనం



మున్సిపల్ కార్మికులతో భోజనం చేస్తున్న బయ్యా వాసు, రవి తదితరులు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగ సందర్భంగా శుభమస్తు షాపింగ్ మాల్ అధినేతలు బయ్యా వాసు, బయ్యా రవి వారి స్వగృహంలో మున్సిపల్ కార్మికులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. సింహపురి కార్తీక దీపోత్సవ కమిటీ కార్యదర్శి మల్లిక, ఆర్‌ఎస్ఎస్ నాయకులు నవీన్, శైలజ, తదితరులు కార్మికులకు వస్త్రాలిచ్చి సత్కరించారు.

కార్ జోన్‌లో దీపావళి

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 21 : నగరంలోని కార్ జోన్ షోరూమ్‌లో దీపావళి వేడుకలు జరిగాయి. ఉదయం లక్ష్మీపూజ చేశారు. యజమానులు శంతన్ కృష్ణ, దేహల్య ఆధ్వర్యంలో సిబ్బంది బాణాసంచా పేల్చారు. కార్ జోన్‌లో వ్యాపారం కంటే వినియోగదారులకు సేవలే ఎక్కువగా అందిస్తామని యజమాని తెలిపారు.



దీపావళి సంబరాల్లో సందడి చేస్తున్న కార్‌జోన్ సిబ్బంది

నేటి నుంచి కార్తీక మాసం

● శైవ క్షేత్రాల్లో సర్వం సిద్ధం

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పవిత్రమైన కార్తీక మాసం బుధవారం ప్రారంభమవుతోంది. నగరంలోని శివాలయాలు కార్తీక మాసోత్సవాలకు సిద్ధమయ్యాయి. నగరంలో రాజరాజేశ్వరి ఆలయంలోని మీనాక్షి సమేత సుందరేశ్వర స్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం 6గంటలకు ఆకాశదీపం ప్రారంభం, 27న సోమవారం, 30వతేదీ కోటి సోమవారం పూజలు జరుగుతాయని ఈవో జనార్దన్‌రెడ్డి తెలిపారు.

● మూలాపేట మూలస్థానేశ్వర ఆలయంలో కార్తీక మాసం వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఈవో ఏవీ శ్రీనివాసులురెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం సాయంత్రం ఆకాశదీపం ప్రారంభం, శ్రీవారి వనంలో అఖండ దీపారాధన, రాత్రి పేట ఉత్సవం జరుగుతాయని తెలిపారు. 23న ఉదయం 11గంటలకు స్వామికి అన్నాభిషేకం, రాత్రి ప్రాకారోత్సవం, 26న ఆదివారం ఉదయం మహారుద్రాభిషేకం, రాత్రి ప్రాకారోత్సవం జరుగు తాయని తెలిపారు. నవంబరు 8న ఉదయం భస్మాభిషేకం, 9న అరుద్ర నక్షత్రం లక్షబిల్వార్చన, రాత్రి వెండినంది సేవ, 16న సహస్ర శంభాభిషేకం, రాత్రి కల్యాణోత్సవం జరుగుతాయని తెలిపారు.

● నగరంలోని పొగతోట ఆదిశంకరా ధ్యాన మందిరంలో బుధవారం నుంచి నవంబరు 20వరకు కార్తీక మాసం వేడుకలు జరుగుతాయని మందిరం మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనందకుమార్, సీవీఎల్ నరసింహులు ఓ ప్రకటనలో తెలిపారు.

● కార్తీక మాసం సందర్భంగా నగరంలోని 20 చిన్న ఆలయాలకు ధూప దీప కిట్స్‌ను ధర్మసింధు ఆధ్యాత్మిక సేవా సమితి సభ్యులు పంపిణీ చేశారు. సమితి కన్వీనర్ ధన్వి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎయిడ్ ఇండియా ఫౌండేషన్ సహాయ సహకారాలతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో నెల్లూరు వెంకటరత్నం, కుడుముల వెంకటేష్, వెంకటేశ్వర్లునాయుడు, మొగిలి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి మహాకార్తీక దీపోత్సవం



దీపోత్సవ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

నెల్లూరు (సాంస్కృతికం) అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని గణేష్ ఘాట్‌లో నవంబరు 5, 6, 7తేదీల్లో మహా కార్తీక దీపోత్సవం జరగనుంది. దీనికి సంబంధించిన కరపత్రాలను ఆ ఘాట్ వెంబడి ఉన్న స్వర్ణలింగేశ్వరస్వామి వారి దేవస్థానంలో మంగళవారం నిర్వాహకులు ఆవిష్కరించారు. దీపోత్సవ సమితి అధ్యక్షురాలు డాక్టర్ కే వెన్నెల మాట్లాడుతూ మహాకార్తీక దీపోత్సవం కన్నుల పండుగ నిర్వహిస్తున్నామని చెప్పారు. గోపూజతో ప్రారంభించి, శ్రీశైల మల్లికార్జునస్వామివారి నమూనా విగ్రహ పూజలు, భక్తాభిషేకం జరుగుతాయని తెలిపారు. సాయంత్రం 4.30గంటల నుంచి కార్తీక దీపోత్సవం ర్యాలీ, ఆకాశదీపం, కాశీపండితులతో గంగా హారతి, మహా కార్తీక దీపోత్సవం, శివకేశవ పీఠం అధ్యక్షురాలు మాతా శివానంద సరస్వతి అనుగ్రహ భాషణం జరుగుతాయన్నారు. స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్, సినీ గేయ రచయిత అనంత్ శ్రీరామ్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దీపోత్సవ సమితి కార్యదర్శి బయ్యా మల్లిక, ఉపాధ్యక్షురాలు కోడూరు జయప్రద మాట్లాడుతూ నెల్లూరులో వెయ్యి మంది సింహపురి కార్తీక దీపోత్సవ, శ్రీకంఠం రమణయ్య, రమేష్ ఆచారి, వ్యాస్ ప్రసాద్ రఘునాథరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేయొద్దు

నెల్లూరు(సిటీ, ఆంధ్రజ్యోతి) : మార్కెట్ల వద్ద రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేయొద్దని కార్పొరేషన్ కమిషనర్ నందన్ సూచించారు. మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోడ్లపై వ్యాపారాలు చేస్తున్న వారితో మాట్లాడి పలు సూచనలు చేశారు.

రేపు స్టేక్ హోల్డర్ల కన్సల్టేషన్ సమావేశం

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 23న బుచ్చిరెడ్డిపాళెం పురపాలక సంఘం కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు స్టేక్ హోల్డర్స్ కన్సల్టేషన్ సమావేశం నిర్వహించను న్నట్టు కమిషనర్ బాలకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, ఇంజినీరింగ్ తదితర శాఖల అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలన్నారు. స్థానిక సంస్థలు, ఆసక్తిగల పౌరులు కూడా మాస్టర్‌ప్లాన్‌పై తమ సలహాలు, సూచనలు ఇవ్వవచ్చునన్నారు.

విద్యుత్ అంతరాయం

వెంకటాచలం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షాలు కురుస్తున్నందున వర్సిటీలోని మహిళల వసతి గృహానికి వచ్చే మెయిన్ లైన్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సోమవారం సాయంత్రం సమస్య నెలకొంది. విషయం తెలుసుకున్న వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత వెంటనే వసతి గృహం వద్దకు చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కొద్ది గంటల్లోనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేలా చర్యలు తీసుకున్నారు. కాగా మంగళవారం వర్సిటీకి సెలవు ప్రకటించారు. అయితే మెయిన్ లైన్‌ను పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేసి మంగళవారం ఉదయాన్నే విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. వీసీ వెంట వర్సిటీ ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ ఉన్నారు.

ఆర్టీసీ బస్సు, వ్యాన్ ఢీ

వెంకటాచలం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చవటపాళెం పంచాయతీ ఎర్రగుంట వద్ద జాతీయ రహదారిపై మంగళవారం ఆర్టీసీ బస్సును ఐచర్ వ్యాన్ ఢీకొంది. స్థానికుల కథనం మేరకు.. గూడూరు నుంచి నెల్లూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును అదే మార్గంలో రాంగ్ రూట్‌లో ఎదురుగా వచ్చి ఐచర్ వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ముందు భాగం దెబ్బ తినగా, ప్రయాణికులు సురక్షితంగా బయట పడ్డారు. ఈ ప్రమాదానికి ముందు గూడూరు నుంచి నెల్లూరు మార్గంలో కంటైనర్ లారీ వస్తుండగా, రాంగ్ రూట్‌లో ఐచర్ వ్యాన్ రావడంతో కంటైనర్ లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో వెనుకనే వచ్చిన ప్రైవేటు బస్సు కంటైనర్ లారీని వెనుక నుంచి ఢీకొంది. అద్దం పగలగా ఒకరిద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.

యూరియా కోసం ఆందోళన వద్దు!

ఎమ్మెల్యే సోమిరెడ్డి



రైతులకు యూరియా కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం రైతులెవరూ ఆందోళన చెందవద్దని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. వెంకటాచలంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం సాయంత్రం రైతులకు యూరియా కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాకు 90 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించినట్లు తెలిపారు. ప్రతి ఎకరాకు మూడు బస్తాల చొప్పున పంపిణీ చేయడానికి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం మాదిరిగా కాకుండా పార్టీలకు అతీతంగా పట్టాలు లేని పొలాలకు కూడా యూరియా కార్డులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. 298 మంది రైతులకు రూ.2.42 కోట్ల విలువైన వ్యవసాయ పరికరాలను రైతులకు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కటంరెడ్డి రాధాకృష్ణారెడ్డి, చవటపాళెం సొసైటీ అధ్యక్షుడు రావూరి రాధాకృష్ణమనాయుడు, సర్వేపల్లి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ చల్లా నాగార్జున్ రెడ్డి, టీడీపీ నేతలు వల్లూరు రమేష్‌నాయుడు, ఈపూరు సుబ్బారెడ్డి, వల్లెపు మునుస్వామి, శ్రీనితారెడ్డి, అగ్రికల్చర్ ఏఓ హరి కరుణాకర్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

● గిరిజన చిన్నారులకు దీపావళి టపాసులు

ముత్తుకూరు : దీపావళి సందర్భంగా పిడతాపోలూరు పంచాయతీ జంగాలకండ్రిగ, బ్రహ్మదేవం గిరిజన కాలనీల్లో సోమవారం మనుమడు, మనుమరాలు సోమిరెడ్డి రణదేవ్, అమైరాతో కలిసి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పర్యటించారు. చిన్నారులతో కాసేపు గడిపి టపాసులు స్వీట్లు, చాక్లెట్లు, బిస్కెట్లు అందజేశారు. బ్రహ్మదేవం గిరిజన కాలనీకి రూ.96లక్షల ఖర్చుతో జెమినీ కంపెనీ వసతులు కల్పించబోతోందన్నారు. జంగాలకండ్రిగలో విద్యా సంస్థల యాజమాన్యం గిరిజనుల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు ప్రయత్నం చేయాలన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు నీలం మల్లి కార్జున యాదవ్, నాయకులు మునుకూరు రవికుమార్‌రెడ్డి, బొమ్మి సురేంద్ర, రమేష్ శర్మ, శీనయ్య, సతీష్, దీనయ్య నాగార్జున, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదు

● కాకాణి గోవర్ధన్ రెడ్డి

వెంకటాచలం, అక్టోబరు 21 (ఆంధ్ర జ్యోతి) : కూటమి ప్రభుత్వ పాలనలో పార్టీల సర్దుబాట్లు తప్ప ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని చెముడుగుంట పంచాయతీ బురాన్‌పూర్ గ్రామంలో సోమవారం ఆయన పర్యటించారు. పేదల రేషన్ అక్రమంగా తరలి వెళ్తున్నా కూటమి ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని ఆరోపించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. ఉద్యోగస్తులకు దీపావళి కానుకగా డీఏలు, పెండింగ్ బకాయిల విషయంలోనూ మోసం చేశారని విమర్శించారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి కుటుంబాన్ని, మాజీ ఎంపీటీసీ సభ్యుడు సుందరరామిరెడ్డిలను పరామర్శించారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు మండల వెంకటశేషయ్య, పామూరు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కోవూరు' అప్రమత్తతకు చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కోవూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : పెన్నానది ప్రవాహం పెరిగి వరద వస్తే ఎదుర్కొనేందుకు సిద్ధంగా కోవూరు నియోజకవర్గ ప్రజానీకాన్ని అప్రమత్తం చేయాల్సిందిగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మంగళవారం కలెక్టరు హిమాన్షు శుక్లాను కోరారు. భారీ వర్షాలు, సోమశిలకు వరద ప్రవాహం వస్తుండటంతో కలెక్టరుకు వెంటనే ఎమ్మెల్యే ఫోను చేసి అప్రమత్తతకు తీసుకోవాల్సిన చర్యల్ని వివరించారు. నియోజకవర్గ పరిధిలో పెన్నానది పొర్లు కట్టలు పలుచోట్ల బలహీనంగా ఉన్నా యన్నారు. అలాంటి చోట్ల రెవిన్యూసిబ్బంది ప్రజానీకాన్ని అప్రమత్తం చేయాలన్నారు. భారీ వర్షాలు, వరదల వల్ల లోతట్టు,తీరప్రాంతాల ప్రజానీకం నష్టపోకుండా చూడాలన్నారు. తహసీల్దార్లు, వీఆర్వోలు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. రెవిన్యూ సిబ్బంది అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం వల్ల మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారుల సూచనల్ని పాటించాల్సిందిగా కోరారు. సముద్రపు వేటలో ఉన్న మత్స్యకారులు వెంటనే తీరానికి చేరుకోవాల్సిందిగా కోరారు. నియోజకవర్గ పరిధిలోని మిత్రపక్షాల నాయకులు, కార్యకర్తలు, అధికారులు అందుబాటులో ఉండాల్సిందిగా కోరారు.

నెల్లూరు రోడ్డుపై గుంతలు పూడ్చిన టైలర్స్ కాలనీ యువకులు

పొదలకూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరు నుంచి నెల్లూరు వెళ్లే ప్రధాన రహదారిపై స్వర్ణలే అవుట్ సమీపంలో వర్షపు నీటితో గుంతలు పడి ప్రయాణికులు ప్రమాదాల బారినపడుతున్నారు. ఇది గమనించిన మాజీ వార్డు మెంబర్ షేక్.దిల్షాద్ చొరవతో టైలర్స్ కాలనీ యువకులు సోమవారం శ్రమదానం చేశారు. రోడ్డుపై ఉన్న గుంతలను జేసీబీ సాయంతో కంకర, మట్టితో పూడ్చివేశారు. దీంతో టైలర్స్ కాలనీ యువకులు షాహీద్, నజీర్, ముఫీజ్, అబ్దుల్‌ను పలువురు అభినందించారు.

బీజేపీ మైనార్టీ మోర్చా మండల కమిటీ ఎన్నిక



నియామక పత్రాలు అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఇందుకూరుపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తూరు బీజేపీ కార్యాలయంలో మండల బీజేపీ అధ్యక్షుడు కైలాసం శ్రీనివాసులు రెడ్డి ఆధ్వ ర్యంలో మంగళవారం మైనార్టీ మోర్చా మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా షేక్ సునీల్‌అహ్మద్, ప్రధాన కార్యదర్శిగా షేక్ షఫీ, కార్యదర్శిగా షేక్ చాంద్ బాషాలను ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా బీజేపీ సీనియర్ నాయకుడు మారుబోయిన శ్రీనివాసులు హాజరై నూతనంగా ఎన్నికైన మండల కార్యవర్గాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో నెల్లంబాక శివ ప్రసాద్, సీహెచ్ గాంధీ, చేవూరు వెంకట్రావు, అతిపాటి శరత్, మెట్టా రమేష్ రెడ్డి, గుమ్మడి పరంధామయ్య, తువ్వర రాంబాబు, దొం తాల మహేష్, లేబూరు రవీంద్రబాబు, తిరుపతి, షేక్ రఫీ, షేక్ మస్తాన్‌బీ, రాధయ్య, విమలమ్మ పాల్గొన్నారు.

రైతులందరికీ అందుబాటులో యూరియా

పొదలకూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలో వరి సాగు చేసే రైతులందరూ యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయ అధికారి వి.ప్రతాప్, పీఏసీఎస్ చైర్మన్ తలచీరు మస్తాన్‌బాబు తెలిపారు. మండల పరిధిలోని నల్లపాలెం, మహమ్మదాపురం, తాటిపర్తి, విరువూరు, డేగపూడి, ఆర్‌వై.పాలెం గ్రామాల్లో యూరియా అందుబాటులో ఉందన్నారు. వరి పంట సాగు చేయు రైతులు మీ పరిధిలోని రైతు సేవ కేంద్రం సిబ్బంది వద్ద యూరియా కార్డులు తీసుకుని ప్రభుత్వం సిఫార్సు చేసిన ఎకరాకు 3బస్తాలు, (మూడు దఫాలలో) యూరియా పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమేష్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, పెంచలయ్య, అజయ్, అనీల్, కృష్ణయాదవ్, కృష్ణారెడ్డి, మల్లికార్జునయాదవ్, రైతులు పాల్గొన్నారు.

నావూరుపల్లిలో పశువైద్య శిబిరం

పొదలకూరు, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నావూరుపల్లిలో మంగళవారం పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ సహకారంతో పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పొదలకూరు వెటర్నరీ ఏడీ అరుణ, అల్లూర్తి వెటర్నరీ డాక్టర్ రాధిక, ఎదకురాని పశువులకు, దూడలతో పాటు మిగిలిన పశువులకు వైద్యం చేశారు. పశువులకు బలానికి మినరల్ మిక్చర్ ప్యాకెట్లను సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మస్తాన్‌బాబు, ఈవో డీఎల్‌డీఏ శ్రీనివాసులు పాల్గొన్నారు.

వెలుగొండను కమ్మేసిన మేఘాలు



ఉదయగిరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పచ్చదనం.. కమ్మేసిన మేఘాలతో వెలుగొండలు అందాలను విరజిల్లుతున్నాయి. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో అడవులు పచ్చదనాన్ని సంతరించుకున్నాయి. దీనికితోడు మేఘాలు కొండలను తాకుతున్న దృశ్యాలు అబ్బురపరుస్తున్నాయి. ఈ ప్రకృతి రమణీయత దృశ్యాలను చూసి ప్రతిఒక్కరు మంత్రముగ్ధులవుతున్నారు. ఆ అందాలను తమ సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తూ మైమరుస్తున్నారు.

ప్రమాదకర వంక దాటాల్సిందే..



అనంతసాగరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు స్థానిక గిరిజన కాలనీలో ప్రమాదకర వంక వర్షపు నీటితో పోటెత్తుతోంది. కాలనీలో వంకకు రెండు వైపులా ఇళ్లు ఉన్నాయి. దీంతో కాలనీ వాసులు బయటకు రావాలంటే వంక దాటాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రమాదమని తెలిసినా కాలనీవాసులు అందులో దిగి వస్తున్నారు. వంకపై బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్నారు.

ఎరక్కపోయి.. ఇరుక్కుపోయి..!



ఉదయగిరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆహారం కోసం ఓ శునకం ప్లాస్టిక్ డబ్బాలో మూతి దూర్చి ప్రాణం మీదకు తెచ్చుకుంది. మంగళవారం పట్టణంలోని అటవీ శాఖ కార్యాలయ సమీపాన గల చెత్తకుప్పల్లో శునకం ఆహారం కోసం వేట సాగిస్తూ ప్లాస్టిక్ డబ్బాలో తన మూతిని దూర్చింది. దీంతో ఆ డబ్బా ఎంతసేపటికీ రాకపోవడంతో దాని ఆర్తనాదాలు విన్న స్థానికులు డబ్బాను తొలగించడంతో ప్రాణాలు దక్కినట్లయ్యింది.

క్రీడా అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ 2025 సంవత్సరానికి క్రీడా అవార్డులు అందచేసేందుకు అర్హులైన శిక్షకులు, క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌డీవో ఆర్‌కే యతిరాజ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అర్జున అవార్డు, అర్జున లైఫ్ టైమ్ అవార్డు, మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డు, ద్రోణాచార్య, ద్రోణాచార్య లైఫ్ టైమ్ అవార్డు, రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కారం అందచేస్తారని తెలిపారు. అర్హత కలిగిన వారు ఈనెల 28వతేదీ అర్ధరాత్రిలోపు ఠీఠీఠీ.ఛీఞ్చటఞ ఇౌ్టటఔౌ౦.జీ పోర్టల్‌లో పొందుపరిచిన నిబంధనలను అనుసరించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

తుస్సుమన్న టపాసుల వ్యాపారం

● రెండు రోజుల ముందు దుకాణాల కేటాయింపు ● అప్పటికే భారీ వర్షాలతో మైదానాల్లో నీరు

● పండుగ రోజూ వదలని వాన ● మునిగిపోయామంటున్న వ్యాపారులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): టపాసుల వ్యాపారం కొన్ని సంవత్సరాలుగా జూదంగా మారిపోయింది... సరిగ్గా దీపావళి పండుగ ముందు వెనుక రోజుల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో వ్యాపారాలు అంతంతమాత్రంగా మారుతున్నాయి. గతంకంటే ఎక్కువగా ఈసారి దీపావళికి ఎడతెగని వర్షాలు కురవడంతో అమ్మకాలేక నష్టపోయామని బాణసంచా వ్యాపారులు లబోదిబోమంటున్నారు.

ఆలస్యంగా కేటాయింపు కొంప ముచ్చింది

జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది దీపావళి పండుగకు రెండు రోజుల ముందు మాత్రమే దుకాణాలు ఏర్పాటు చేసే ప్రదేశాలను అధికారులు కేటాయించారు. అయితే అప్పటికే జిల్లా అంతటా వర్షాలు కుస్తుండటంతో షాపులు ఏర్పాటు చేసే మైదానల్లో నీరు నిలిచి చిత్తడిగా మారాయి. పండుగకు రెండు రోజుల ముందు కేటాయింపులు చేయడంతో వ్యాపారులకు దుకాణాలు ఏర్పాటు చేసుకోవడానికే ఎక్కువ సమయం సరిపోయింది. దీనికితోడు ఈ నెల 19,20వ తేదీల్లో భారీగా వర్షాలు కురుస్తూనే ఉండటంతో టపాసులు కొనేందుకు ప్రజలు ముందుకు రాలేదు. వచ్చినా నీరు నిల్వ లేని దుకాణాల్లోనే కొనుగోలుకు ఆసక్తి చూపారు. అదే... కొన్ని రోజుల ముందే దుకాణాలు కేటాయించి ఉంటే నీరు నిలబడకుండా ఏర్పాట్లు చేసుకునేవారమని, అప్పుడు పరిస్థితి మరింత మెరుగ్గా ఉండేదని వ్యాపారులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా వర్షాల కారణంగా టపాసుల ధరల్లో హెచ్చు తగ్గులు కనిపించాయి. ఎలాగైనా సరుకు అమ్ముకోవాలనే ఉద్దేశంతో కొందరు వ్యాపారులు ఆదాయం తగ్గించుకుని అమ్మకాలు జరిపారు.



నెల్లూరు : వీఆర్సీ మైదానంలో బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసిన చోట వర్షపు నీరు

ప్రభుత్వానికి ఆదాయం

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది దీపావళి టపాకాయల వ్యాపారానికి వర్షం దెబ్బ తీవ్రంగా తాకింది. ఏటా దీపావళికి జిల్లా వ్యాప్తంగా రూ.4కోట్ల నుంచి 6కోట్ల మేర వ్యాపారం జరుగుతుంది. దీపావళికి వారం ముందు నుంచే కొనుగోళ్లు జరుగుతాయి. అయితే ఈ దఫా వర్షాలు కురవడం వల్ల రిటైలర్లు స్టాకిస్టుల నుంచి ఎక్కువ మొత్తంలో టపాసులు కొనుగోలు చేయలేదు. కొనుగోలు చేసిన టపాకాయలను కూడా లాభాలు తగ్గించుకుని విక్రయించుకోవాల్సి వచ్చింది. కానీ, ప్రభుత్వానికి మాత్రం దుకాణాల కేటాయింపునకు సంబంధించిన నేల అద్దెలు, ట్రేడ్ లైసెన్స్‌లు, లైసెన్స్ జీఎస్టీ పన్నులతో ఆదాయం సమకూరింది.

పూర్తిగా మునిగిపోయాం..

- సునీల్‌కుమార్



నెల్లూరులోని వీఆర్‌సీ మైదానంలో 26వ షాప్‌లో ఈ ఏడాది టపాసుల దుకాణం ఏర్పాటు చేశాం. మా షాపు దగ్గర వర్షపునీరు ఎక్కువగా నిలిచింది. వరుసలో ముందున్న దుకాణాల వద్ద ప్రజలు టపాసులు కొనుగోలు చేశారు తప్ప వెనుక ఉన్న దుకాణాల వద్దకు రాలేదు. దీంతో రూ.లక్షలు నష్టపోయాము.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

కోవూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : స్థానిక పూనూరివారివీధిలో కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి మూడు రోజుల కిందట ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. వివరాల్లోకి వెళ్తే... కోవూరు పట్టణంలోని పూనూరి వారి వీధికి చెందిన బైనా రాజగోపాల్ (46)కు భార్యతో మనస్పర్థలు ఏర్పడ్డాయి. దీంతో భార్య పుట్టింటికి వెళ్ళింది. దీంతో ఆయన తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. దుర్వాసన వస్తుండటంతో మంగళవారం స్థానికులు తలుపులు పగులగొట్టి చూడగా రాజగోపాల్ మృతదేహం కనిపించింది. వెంటనే స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్‌ఐ 2 ఖాదర్ బాష, ట్రైనీ ఎస్‌ఐ అనూష కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆ.. అవ్వ కన్ను మూసింది !

● ఈ పాపం ఎవరిదని మృతదేహం ప్రశ్నిస్తోంది?



వృద్ధురాలి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మనుబోలు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): 'ముగ్గుబుట్ట వంటి తల.. ముడతలుదేరిన దేహం.. లోతుకెళ్లిన గాజుకళ్లు.. తనకన్నా శవం నయం! ఆ.. అవ్వే మరణిస్తే ఆ.. పాపం ఎవ్వరిదని.. పిల్లగాలి ప్రశ్నిస్తూ వెళ్లిపోయింది' అంటూ 'భిక్షువర్షీయసీ' కవితలో ఆవేదన చెందారు మహాకవి శ్రీశ్రీ. అచ్చం.. ఇలాంటి దీన దృశ్యమే మంగళవారం మనుబోలులో ఆవిష్కృతమైంది. కలువాయి గ్రామానికి చెందిన ఏండ్లు మీరిన ఓ అవ్వ కొన్నాళ్ల క్రితం మనుబోలు బస్టాండుకు చేరుకుంది. ఇటీవల వృద్ధురాలి దీనవస్థను కళ్లారా చూసిన ఆర్‌ఐతో పాటు సిబ్బంది ఎండలో నరక యాతన అనుభవిస్తున్న ఆ అవ్వను సంచిలో మోసుకెళ్లి బస్టాండు ఆవరణలో చేర్చారు. బంధువులకు సమాచారం అందించినా స్పందించలేదు. భర్త, కుమారుడు చనిపోయారు. కోడలు, మనుమడు ఆమెతో మాకు ఏ సంబంధమూ లేదన్నారు. అవ్వ అనాథ అయింది. దీంతో స్థానికంగా ఉన్న ఓ పాత్రికేయుడు, రెవెన్యూ సిబ్బంది, స్థానికులే ఇన్నాళ్లు అవ్వకు ఆకలి వేళకు ఇంత అన్నం పెట్టి, బట్టలు ఇచ్చారు. అయితే.. నెలరోజులుగా మనుబోలులో భిక్షాటన చేస్తూ, గ్రామస్తుల సాయంతో కలో, గంజో తాగి బస్‌షెల్టర్‌లోనే బతుకీడ్చిన సుబ్బమ్మ (70) మంగళవారం వేకువజామున మరణించింది. స్థానికులు గుర్తించి పోలీసు, రెవెన్యూ, పంచాయతీ అధికారులకు సమాచారం అందించారు. సుబ్బమ్మది కలువాయి స్వగ్రామం. బంధువులు ఎవరూ రాకపోవడంతో, అనాథశవంగా కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అయినవాళ్లెవరూ లే(రా)కపోవడంతో.. ఈ పాపం ఎవరిదని కొంతమంది స్థానికులు అవ్వ మృతిపై ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పంచాయతీ సిబ్బంది, పోలీసులే అవ్వ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు.

గూడ్స్ రైలు ఢీకొని మహిళ మృతి

కావలి రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా గూడ్స్ రైలు ఢీ కొని బీ క్రిస్టిన (43) మృతి చెందిన సంఘటన మంగళవారం స్థానిక బుడంగుంట రైల్వే గేట్ సమీపంలో జరిగింది. జీఆర్పీ పోలీసుల వివరాల మేరకు.. మృతురాలి తల్లి దండ్రులు 7 సంవత్సరాల క్రితం మృతి చెందగా, వారి ఇద్దరు కుమార్తెలు, కుమారుడికి కూడా మానసిక స్థితి సరిలేదు. పట్టణంలోని క్రిష్టియన్‌పేట మొదటి లైన్‌లోని చర్చి ఫాదర్ జోయల్ ప్రేమ్‌కుమార్ సంరక్షణలో వీరు ఉంటున్నట్లు తెలిపారు. మతి స్థిమితం లేని అవివాహితురాలైన క్రిస్టిన ఉదయం ట్రాక్ దాటుతుండగా 3వ లైన్‌లో నెల్లూరు వైపు వెళ్తున్న గూడ్స్ రైలు ఢీ కొనటంతో అక్కడికక్కడే మృతి చెందింది. లోకో పైలెట్ ఫిర్యాదు తో సంఘటనా స్థలాన్ని జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లారీ ఢీకొని మూడు గేదెలు...

సీతారామపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలంగారిపల్లి గ్రామ సమీపానల గల 167-బీజీ జాతీయ రహదారిపై లారీ ఢీకొని మూడు గేదెలు మృతిచెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకొంది. వివరాల మేరకు.. సీతారామపురం నుంచి ఉదయగిరికి వెళుతున్న ఇండేన్ గ్యాస్ సిలిండర్ల లారీ పోలంగారిపల్లి గ్రామం వద్ద జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న గేదెలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గేదెలు అక్కడికక్కడే మృతిచెందాయి. చనిపోయిన గేదెల విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోవూరులో పూరిల్లు దగ్ధం

కోవూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : స్థానిక గ్రంథాలయం వీధిలోని ఓ ఇంట్లో దీపం కిందపడటంతో మంటలు ఎగసి మంగళవారం ఓ పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. వివరాల్లోకి వెళ్తే.. లైబ్రరీ వీధిలో నివాసముంటున్న వంగపాటి మాధవి ఇంట్లో దేవుని మందిరంలో పూజ చేసి దీపం వెలిగించింది. తర్వాత పని నిమిత్తం ఇంట్లో నుంచి బయటికి వెళ్లగా, అదే సమయంలో దీపం కిందపడి మంటలు చెలరేగాయి. అట్టపెట్టెలతో పైకప్పు ఏర్పాటు చేసి ఉండటంతో ఇల్లు పూర్తిగా కాలింది. స్థానికులు నీళ్ళతో మంటల్ని అదుపు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఎస్‌ఐ(2) ఖాదర్ బాష, ట్రైనీ ఎస్‌ఐ అనూష ఘటనా స్థలానికి చేరుకుని దగ్ధమైన ఇంటిని పరిశీలించారు.

24న లంకా దినకర్ రాక

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : 20 అంశాల కార్యక్రమం అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ ఈనెల 24న జిల్లాకు వస్తారని కలెక్టర్ శుక్లా ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సింహపురి ఎక్స్‌ప్రెస్ రైల్లో ఉదయం 7.08 గంటలకు నెల్లూరుకు చేరుకుని గెస్ట్ హౌస్‌లో విశ్రాంత తీసుకుంటారని తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అమలవుతున్న ఆరోగ్య, విద్య, రంగాలకు సంబంధించిన ప్రత్యేక పథకాల అమలు, అమృత పథకం, జల్ జీవన్ మిషన్, ప్రధాన మంత్రి సూర్యఘన్ తదితర పథకాల పురోగతిపై కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు.

తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● ఆర్డీవో అనూష

నెల్లూరు (వెంకటేశ్వరపురం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : అధిక వర్షాలు, తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో తీర ప్రాంత ప్రజలతో పాటు లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు ఆర్డీవో అనూష ఓ ప్రకటనలో సూచించారు. ముఖ్యంగా మత్స్యకారులు రానున్న రెండు, మూడు రోజులు చేపల వేటకు సముద్రంలోకి వెళ్లరాదన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఎవరూ తీర ప్రాంతాలకు వెళ్లకూడదని, ఎలాంటి అవసరమైనా స్థానిక సచివాలయాల్లో అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్నీ ఏర్పాట్లు చేశామని, నెల్లూరు ఆర్డీవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

24న డిప్యూటీ స్పీకరు రాక

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 24న రాష్ట్ర శాసన సభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు జిల్లా పర్యటనకు వస్తున్నారని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు కనుపర్తిపాడులోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుంటారని, 11.30గంటలకు తాడేపల్లికి బయలుదేరుతారని తెలిపారు

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో ఇద్దరి డీబార్

వెంకటాచలం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్శిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల్లో మంగళవారం జరిగిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షలలో ఇద్దరు విద్యార్థులు డీబార్ అయినట్లు వర్శిటీ పరీక్షల నిర్వాహణాధికారిణి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం జరిగిన మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలకు 13,908 మంది విద్యార్థులు హాజరు కాగా, 1016 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. వెంకటగిరిలోని విశ్వోదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన ఇద్దరు విద్యార్థులను డీబార్ చేసినట్లు తెలిపారు.

మోక్షమార్గం.. కార్తీకం

● నేటి నుంచి కార్తీక మాసం ప్రారంభం ● ముస్తాబైన శైవక్షేత్రాలు ● నెల రోజులపాటు మహోత్సవాలు

ఉదయగిరి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం శివకేశవులిరువురికి ప్రీతికరమైన మాసం. తెల్లవారుజామునే నిద్రలేచి నది, కాలువ, లేదా నూతిలో నీటితో స్నానమాచరించి శివాలయాలకు వెళ్లి దర్శనం చేసుకుంటే మంచిది. అలాంటి కార్తీక మాసానికి జిల్లాకు సరిహద్దు ప్రాంతంలో దట్టమైన వెలుగొండల నడుమ ప్రకృతి రమణీయత, ఆహ్లాదకర వాతావరణం మధ్య ప్రముఖ శైవక్షేత్రాలైన ఘటికసిద్ధేశ్వరం, భైరవకోనలు ఉన్నాయి.

భైరవకోన: బ్రహ్మ, రుద్ర, విష్ణు కొండల నడుమ కనువిందు చేసే దృశ్యాలతో భక్తులను ఆకట్టుకొనే క్షేత్రమే భైరవకోన. దట్టమైన వెలుగొండ అటవీ ప్రాంతం, దూకే జలపాతాలు, పారే సెలయేళ్ల మధ్య ఒకే రాతిలో మలిచిన అష్ట శివాలయాలు, బాలభైరవ ఆలయాలు ఇక్కడ ప్రసిద్ధి. ఈ మాసంలో భక్తుల కోసం నిర్వాహకులు కోనలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుంటారు. కోనలో నిర్మించిన భారీ అభయాంజనేయస్వామి విగ్రహం ఎంతో అపురూపంగా ఉంటుంది. ప్రతిరోజు స్వామివార్లకు అభిషేకాలు, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు.



ఘటికసిద్ధేశ్వరంలో పరమేశ్వరుడు



ఒకేరాతిలో మలిచిన అష్టలింగాలయాలు

ఘటికసిద్ధేశ్వరం: ఈ క్షేత్రం అత్యంత ప్రాచీనమైంది. దారి పొడవునా పారే సెలయేళ్లు, పచ్చటి అందాలు, ఆహ్లాదకరమైన వాతావరణంతో ప్రకృతి రమణీయంగా ఉంటుంది. ఘటికసిద్ధేశ్వరంలో శివునికి అత్యంత ఇష్టమైన బిల్వపత్రాలు, నాగమల్లెలు కలవు. ఈ పత్రాలతో భక్తులు పూజలు నిర్వహిస్తుంటారు. ఆయా క్షేత్రాల్లో ఆలయ నిర్వాహకులు భక్తులకు నిత్యఅన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు. అలాగే ఉదయగిరి మండలంలో గండిపాళెం, లింగాలదొన, కుర్రపల్లిగడ్డ కాశినాయన ఆశ్రమాల్లో కార్తీక మాసం సందర్భంగా స్వామివార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.



ఘటికసిద్ధేశ్వరంలో జాలువారుతున్న జలపాతం

కండలేరుకు వరదపై ఎమ్మెల్యే కురుగొండ్ల సమీక్ష

రాపూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : కండలేరుకు వరద పెరుగుతోందని నీటి పారుదల శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. మంగళవారం డ్యాంను సందర్శించి అధికారులతో సమీక్షించారు. అనంతరం అతిథి భవనంలో మీడియాతో మాట్లాడుతూ జలాశయ పరివాహక ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం 60 టీఎంసీ వరకు కండలేరులో నీరు నిల్వ ఉందని, అల్పపీడనం ప్రభావం వలన మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీ నరసింహం, టీడీపీ మండల అధ్యక్షుడు దందోలు వెంకటేశ్వర్లురెడ్డి, ఇతర నాయకులు నువ్వుల శివ రామకృష్ణ, ప్రసాద్ నాయుడు, చెన్ను భాస్కర్ రెడ్డి, కండలేరు ఈఈ గజేంద్ర రెడ్డి, డీఈఈ నాగేంద్రబాబు, కండలేరు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● రాళ్లపాడుకు సోమశిల జలాలు

లింగసముద్రం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మరో నాలుగైదు రోజుల్లో సోమశిల నుంచి కృష్ణా జలాలు రాళ్లపాడు ప్రాజెక్టుకు రానున్నాయి. ప్రభుత్వ జీవో మేరకు ప్రాజెక్టుకు 1.5 టీఎంసీ నీరుల చేరుతుందని, దీంతో ప్రాజెక్టు ఆయకట్టు రైతుల కల నెవేరనుంది.వర్షాలు కురవకు పోతే ఈనెల 23 తరువాత ప్రాజెక్టులోకి సోమశిల జలాలు వస్తాయని ప్రాజెక్టు అధికారుల ద్వారా తెలిసింది.అయితే సోమశిల జలాలను ప్రాజెక్టుకు అందించే కాలువ పనులు వారం క్రితం పూర్తైనట్టు ప్రాజెక్టు డీఈఈ ఎం వెంకటేశ్వర్లు మంగళవారం చెప్పారు.

● సోమశిలకు భారీ వరద

అనంతసాగరం అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సోమశిలకు ఎగువ నుంచి వరద పెరుగుతుండగా అధికారులు, జిల్లా ప్రజల్లో ఆందోళన మొదలైంది. సోమశిల పూర్తిసామర్థ్యం 78 టీఎంసీలు కాగా, మొన్నటి వరకు 74 టీఎంసీలకు పరిమితం చేశారు. కాగా గత రెండు రోజులుగా పెన్నా క్యాచ్‌మెంట్‌లో కురుస్తున్న వర్షాలకు కడప జిల్లా సిద్దవటం బ్రిడ్జి వద్ద ప్రవాహం అధికంగా ఉంది. బుధవారం సాయంత్రానికి సోమశిలకు భారీ వరద నమోదు కావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.



కండలేరు జలాశయాన్ని పరిశీలిస్తున్న వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, అధికారులు

ఉద్యోగులను దగా చేస్తున్న ప్రభుత్వం : ఎమ్మెల్సీ చంద్రశేఖర్

నెల్లూరు(వెంకటేశ్వరపురం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఉద్యోగులకు ఇవ్వవలసిన డీఏ బకాయిలను పదవీ విరమణ సమయంలో ఇస్తామంటూ కూటమి ప్రభుత్వం దగా చేస్తోందని వైసీపీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి ఆరోపించారు. నగరంలోని వైసీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నాలుగు పెండింగ్ డీఏల్లో ఒకటి మాత్రమే అందజేస్తూ ఉద్యోగుల కడుపు మీద కొడుతున్నారన్నారు. డీఏ బకాయిలు రూ.34వేల కోట్లను విడతల వారీగా చెల్లించాలని డిమాండ్ చేశారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి,

టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి : విద్యాశాఖ ఆర్జేడీ

నెల్లూరు(విద్య), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ బీ లింగేశ్వరరెడ్డి ఆదేశించారు. నెల్లూరులోని దర్గామిట్ట జడ్పీ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం నెల్లూరు నగర, రూరల్ నియోజకవర్గ ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులతో ఆర్జేడీ సమీక్ష జరిపారు. విద్యాశాఖ షెడ్యూల్ ప్రకారం సిలబస్‌ను పూర్తిచేసి విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. అవసరమైతే ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎఫ్‌ఏ-1, 2 పరీక్షల ఆధారంగా విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి వాటికి అనుగుణంగా బోధనా ప్రమాణాలను పెంచాలన్నారు. విద్యార్థుల ఆధార్ నమోదును వేగవంతం చేయాలని సూచించారు. బడిబయట ఎవరూ కూడా ఉండకూడదన్న ఆదేశాలను అనుసరించి బడిలో ఎంతమందిని చేర్పించారు, బయట ఇంకా ఎంతమంది ఉన్నారన్న జాబితాలను విద్యాశాఖకు అందించాలని కోరారు.



మాట్లాడుతున్న ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	130
స్కిన్ చికెన్	236
స్కిన్‌లెస్	260

కోడిగుడ్ల ధర (100) : 560

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.12340
వెండి కిలో ధర	రూ. 1,65,000
వెండి ఒక గ్రాము	రూ.171.00

రాళ్లపాడుకు సోమశిల జలాలు

లింగసముద్రం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మరో నాలుగైదు రోజుల్లో సోమశిల నుంచి కృష్ణా జలాలు రాళ్లపాడు ప్రాజెక్టుకు రానున్నాయి. ప్రభుత్వ జీవో మేరకు ప్రాజెక్టుకు 1.5 టీఎంసీ నీరుల చేరుతుందని, దీంతో ప్రాజెక్టు ఆయకట్టు రైతుల కల నెవేరనుంది.వర్షాలు కురవకపోతే ఈనెల 23 తరువాత ప్రాజెక్టులోకి సోమశిల జలాలు వస్తాయని అధికారుల ద్వారా తెలిసింది.అయితే సోమశిల జలాలను ప్రాజెక్టుకు అందించే కాలువ పనులు వారం క్రితం పూర్తైనట్టు ప్రాజెక్టు డీఈఈ ఎం వెంకటేశ్వర్లు మంగళవారం చెప్పారు.

దగదర్తిలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం



అమరవీరులకు నివాళులర్పిస్తున్న పోలీసులు, న్యాయవాది

దగదర్తి (బిట్రగుంట) అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పోలీస్‌స్టేషన్లో న్యాయవాది, సామాజిక వేత్త ఇర్ల వెంకటరమణయ్య ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. విధి నిర్వాహణలో అసువులు బాసిన అమరవీరులకు ఎస్‌ఐ జంపానికుమార్, సిబ్బంది నివాళులర్పించారు. బోగోలు పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ ప్రభాకర్ సిబ్బందితో కలిసి పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు.

సుబ్బానాయుడి మృతి టీడీపీకి తీరని లోటు

● సుబ్బానాయుడు, భానుచందర్ చిత్రపటాలకు ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి ఘన నివాళి



సుబ్బానాయుడు, భానుచందర్‌ల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి, టీడీపీ నేతలు

కావలి, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ రాష్ట్ర చైర్మన్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు, ఆయన సోదరుడు రవీంద్రనాయుడి తనయుడు మాలేపాటి భానుచందర్‌ల మృతి టీడీపీకి తీరని లోటని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అన్నారు. దగర్తి మండలానికి చెందిన మాలేపాటి కుటుంబంలో ఈనెల 20 వ తేదీ తెల్లవారుజామున మాలేపాటి సుబ్బానాయుడు, 18వ తేదీ రాత్రి మాలేపాటి భానుచందర్‌లు మృతి చెందటంతో దగదర్తి గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కావలి ఏరియా వైద్యశాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో వారిద్దరి చిత్రపటాలకు ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి, టీడీపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుబ్బానాయుడు పార్టీ బలోపేతానికి ఎనలేని కృషి చేశారని, ఆయనతో పాటు యువ నాయకుడు భానుచందర్ మృతి పార్టీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో కావలి ఏఎంసీ చైర్మన్ పోతుగంటి అలేఖ్య, టీడీపీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుత్తికొండ క్రిషోర్, జ్యోతిబాబూరావు తదితరులు పాల్గొన్నారు. కమ్మవారి సేవాసమితి ఆధ్వర్యంలో వెంగళరావునగర్‌లోని కార్యాలయం లో మాలేపాటి సుబ్బానాయుడు, భానుచందర్ చిత్రపటాలకు నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడీపీకి, కమ్మవారి సేవా సమితి అభివృద్ధికి వారు చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు మాకినేని మాల్యాద్రి, నాయకులు పాల్గొన్నారు.

పొరుగు సేవల సిబ్బందికి ఈఎస్‌ఐ, పీఎఫ్ ప్రాథమిక హక్కు

ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి



పొరుగు సేవల సిబ్బందికి సమ దుస్తులు, రెయిన్ కోట్లు పంపిణీ చేస్తున్న సురేష్ రెడ్డి

కావలి (టౌన్) అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పొరుగు సేవల సిబ్బందికి ఈఎస్‌ఐ, పీఎఫ్ ప్రాథమిక హక్కు అని ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపు రెడ్డి సురేష్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో కావలి డిపో మేనేజర్ ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సురేష్ రెడ్డి సొంత నిధులతో పొరుగు సేవల సిబ్బందికి సమదుస్తులు, రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. పారిశుధ్య సిబ్బందిని సత్కరించారు. ఆర్టీసీ డిపోలో పనిచేసే పారిశుధ్య కార్మికులు సరుకు రవాణా (కార్గో)లో పనిచేసే సిబ్బంది ఆర్టీసీకి గుండెకాయ లాంటి వారన్నారు. ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం లేని సిబ్బందికి 15 రోజుల్లో ఆయా సౌకర్యాలు కల్పించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఎం కల్పన, బీజేపీ సీనియర్ నేతలు బ్రహ్మానందం, వీవీ రంగారెడ్డి, కంచర్ల మురళీకృష్ణ, బెల్లంకొండ మాల్యాద్రి, సీవీసీ సత్యం, మందా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



దుస్తులు అందజేస్తున్న మాల్యాద్రిగౌడ్, మిత్ర బృందం

కలిగిరి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పంచాయతీ ఆధ్వర్యంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం జై గౌడ ఉదయగిరి నియోజకవర్గ అధ్యక్షుడు మాల్యాద్రి దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలిగిరి పట్టణంలో సేవా కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల్యాద్రి స్నేహితులు గౌస్‌పీర్, మస్తాన్, పొన్నం చిన్న, చింతంరెడ్డి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు బోల్తా.. పలువురికి స్వల్ప గాయాలు

డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ప్రాణాపాయం



పొలాల్లో బోల్తా పడిన ఆర్టీసీ బస్సు

జలదంకి, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): జలదంకి మండలం నాగిరెడ్డిపాలెం క్రాస్‌రోడ్ సమీపంలో మంగళవారం ఉదయం కావలి ఆర్టీసీ డిపో బస్సు ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి పక్కనే ఉన్న పంటపొలాల్లోకి దూసుకెళ్ళింది. ఎదురుగా వస్తున్న లారీ డ్రైవర్ నిద్రమత్తులో ఉండడంతో బస్సుపైకి లారీ దూసుకువచ్చింది. దీంతో అప్రమత్తమైన ఆర్టీసీ డ్రైవర్ చాకచక్యంగా బస్సును రోడ్డుమార్జిన్‌కు తీసుకుపోయాడు. జాతీయరహదారి కొత్తగా నిర్మాణం జరగడంతో టైర్లు ఊడిపోయి బస్సు పొలాల్లోకి వెళ్ళి బోల్తా పడింది. కావలి నుండి చామదల మీదుగా నెల్లూరుకు వెళ్తున్న ఈ బస్సులో 10మంది ప్రయాణీకులు ఉన్నారు. బస్సు బోల్తా పడడంతో ప్రయాణీకులు భయాందోళనకు గురయ్యారు. డ్రైవర్ అప్రమత్తతో స్వల్పగాయాలతో ప్రయాణీకులు బయటపడ్డారు. బస్సును కావలి ఆర్టీసీ డిపో సిబ్బంది క్రేన్ సాయంతో బయటకు తీసి డిపోకు తరలించారు. లారీ ఆగకుండా కావలి వైపు వేగంగా వెళ్ళిపోయింది. ఈ సంఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

రహదారులపై ఆవుల సంచారం

● ప్రమాదాల బారిన వాహనదారులు



బస్టాండ్ సెంటర్‌లో రహదారిపై సేదతీరుతున్న ఆవులు

ఉదయగిరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో సాయంత్రమైతే చాలు ఇలా ఆవులు రహదారులపై సేదతీరుతూ పాదచారులు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. అసలే ఇరుకైన బస్టాండ్‌లో సాయంత్రం సమయాన ఇతర రాష్ట్రాలకు వెళ్లే బస్సులు అధికంగా బస్టాండ్‌కు చేరుతాయి. ఇటు ఆవులు, అటు బస్సులతో ట్రాఫిక్ సమస్య జటిలమవుతోంది. ఒకానొక సమయంలో ఆవులు ఒకదానికొకటి పొడుచుకుంటూ ప్రజలు, వాహన దారులపైకి వస్తుండడంతో వారు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆవులను నిరోధించాలని అధికారులకు పలువురు విన్నవించినా ఫలితం శూన్యం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆవుల సంరక్షకులను హెచ్చరించి వాటిని సంరక్షించుకునేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వర్షాల వేళ.. అప్రమత్తంగా ఉండండి!



తూర్పు ఎర్రబల్లిలో వర్షానికి రోడ్డుపై చేరిన నీరు

అల్లూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలానికి భారీ వర్ష సూచన ఉన్నం దున తీరప్రాంతంలో మత్స్య కారులు, మండల ప్రజలు అప్రమత్తంగా ఉండా లని డీటీ ప్రవీణ్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అల్పపీడనం వాయుగుండంగా మారి బుధ, గురు వారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉం దన్నారు. తీరం వెంబడి 45 నుంచి 65 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీస్తా యన్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లొద్దని, ప్రజలు చెట్ల కిందకు వెళ్లరాదని పేర్కొ న్నారు. మండలంలో మంగళవారం 32.4 మి.మీ వర్షపాతం నమోదైందన్నారు.

కొండాపురం : మండలంలో మంగళవారం మోస్తరు జల్లులు కురిశాయి. ఉదయం వరకు 13.4 మి.మీ వర్షపాతం నమోదు కాగా, రాత్రి ఎడతెరిపి లేకుండా జల్లులు పడుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయు గుండం కారణంగా ఎవరూ బయటికి వెళ్లి ప్రమా దాలకు గురికావద్దని, ఏవైనా ఇబ్బందులు తలెత్తితే సంబంధిత వీఆర్వోలకు తెలియజేయాలని తహసీల్దారు సురేష్‌బాబు తెలిపారు.

బిట్రగుంట: బోగోలు మండలంలో అల్ప పీడన ప్రభావంతో రెండురోజులుగా జోరు గా వానలు కురుస్తున్నాయి. పలు చోట్ల నీరు నిల్వ ఉండిపోయి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీసీరోడ్ల కార ణంగా వర్షపు నీరు వెళ్లే వీలు లేక ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోయింది. బిట్రగుంట పంచాయతీ కొండబిట్రగుంట దళిత, గిరిజన కాలనీలలో మంగళవారం వర్షపు నీరు నిల్వ ఉండిపోయింది. విశ్వనాథ రావు పేట పంచాయతీ ఇబ్రహీంపేట ముస్లీం వీధిలో వర్షపు నీరు ఇళ్లలోకి చేరడంతో సర్పంచ్ గండూరి మంజుల, పంచాయతీ కార్యదర్శి జాలయ్య, టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు వెంటనే పనులు చేపట్టారు. బోగోలు కుమ్మరవీధి, యాదవపాలెంలో వర్షపు నీరు రోడ్డుపై నిల్వ ఉంది.

వర్షాలతో కళ తప్పిన దీపావళి

ఉదయగిరి రూరల్; అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటా వెలుగులు నింపాల్సిన దీపావళి పండుగ సంబరాలు సోమవారం నివాసాలకే పరిమితమవడంతలో కళ తప్పినట్లయ్యింది. కురుస్తున్న వర్షాలకు తోడు ఆశించిన మేర దుకాణాలు లేకపోవడంతో కొనుగోలుదారుల సంఖ్య కూడా తగ్గుముఖం పట్టింది. గతంలో పల్లెలోను ఇతర వ్యాపారులు సాగించే వ్యక్తులు పండుగ సందర్భంగా బాణాసంచా అమ్మకాలు సాగించేవారు. దీంతో స్థానికంగా ఉండే అన్ని వర్గాల ప్రజలు వాటిని కొనుగోలు చేసి ప్రధాన కూడళ్లు, వీధుల్లో కాలుస్తూ సంబరాలు జరుపుకునేవారు. ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేసిన నిబంధనలతో కేవలం పట్టణాలకే దుకాణాలు పరిమితమయ్యాయి. అదీనూ అరకొరగా మాత్రమే ఉండడంతో అదే అదునుగా భావించిన కొంతమంది వ్యాపారులు తమ ఇష్టానుసారంగా వ్యవహరించి అధిక మొత్తంలో ధరలు నిర్ణయించారు. దీంతో పేద, మధ్య తరగతి కుటుంబీకులు నామామాత్రపు కొనుగోలుతోనే సర్దుకోవాల్సి వచ్చింది. వీటికితోడు రోజుల తరబడి కురుస్తున్న వర్షాల పుణ్యమాని పల్లె ప్రజలు ఇతర పట్టణాలకు ప్రయాణాలు సాగించలేక నివాసాలకే పరిమితమయ్యారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో అరకొర వ్యాపారాలతో ఒకవైపు దుకాణదారులు, అమాంతం పెరిగిన ధరలకు తోడు వాతావరణం సైతం అనుకూలంగా లేకపోవడంతో ప్రజలు ఈ ఏడాది సంతోషాల నడుమ పండుగను నిర్వహించుకోలేదని చెప్పుకోవచ్చు.

ఘనంగా దీపావళి



ఆత్మకూరు గురుకుల పాఠశాలలో దీపావళి సంబరాలు జరుపుకుంటున్న విద్యార్థులు, మున్సిపల్ కౌన్సిలర్లు

ఆత్మకూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను ప్రజలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఆత్మకూరు పట్టణ సమీపంలో ఉన్న గురుకుల పాఠశాలలో పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు విద్యార్థులతో కలిసి బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు సూరా భాస్కర్‌రెడ్డి, శివకోటారెడ్డి, జి వేణు, రాజశేఖర్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బాలకృష్ణ, ప్రిన్సిపాల్ రూత్ తదితరులు పాల్గొన్నారు.

●**ఉదయగిరి:** మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం దీపావళి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

●**దుత్తలూరు:** మండలంలోని అన్ని గ్రామాల్లో దీపావళిని ప్రజలు వైభవంగా నిర్వహించారు. కుటుంబ సమేతంగా ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు.

ఎడతెరిపిలేని వర్షాలతో ప్రజల అవస్థలు

● స్తంభించిన జన జీవనం ● లోతట్టు ప్రాంతాల జలమయం ● పొంగి పొర్లుతున్న డ్రైనేజీలు



ఆత్మకూరు: పంటవీధిలో నిలిచిన వర్షపు నీరు



ఉదయగిరి వీధుల్లో ప్రవహిస్తున్న వర్షపు నీరు

ఆత్మకూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మున్సిపాల్టీ పరిధిలోని వీవర్స్ కాలనీ, పేరారెడ్డిపల్లి బీసీ కాలనీ, జెఆర్‌పేట, సుందర్ నగర్, నల్లెల్లూరుపాళెంలోని పలు ప్రాంతాల్లో వర్షపునీరు ఇళ్లల్లోకి రావడంతో ప్రజలు అవస్థలకు గురయ్యారు. 8వ వార్డు పరిధిలో పలుచోట్ల వర్షపునీరు రోడ్లపై నిల్వ ఉండిపోయాయి. పంటవీధిలోని అంతర్గత రోడ్లు బురదమయం అయ్యాయి. దీంతో ప్రజలు, వాహన దారులు ఇబ్బందులకు గురయ్యారు.

●**అనంతసాగరం:** మండలంలో మంగళవారం ఎడతెరపిలేని వర్షం కురిసింది. దీంతో ప్రజలు అవస్థలు పడ్డారు. అనంతసాగరంలో వీధులు జలమయం కాగా బస్టాండ్ వెనుక వీధి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇక పాతాళపల్లి, గోవిందమ్మపల్లి తదితర గ్రామాల్లో వరి కోతలు జరుగుతుండగా రైతులకు అవస్థలు తప్పలేదు.

●**ఉదయగిరి:** ఎడతెరిపిలేని వర్షాలతో ఉదయగిరి పట్టణంలోని వీధులు కాలువలను తలపిస్తున్నాయి. డ్రైనేజీలు పొంగిపొర్లుతుండడంతో ప్లాస్టిక్, ఇతరత్రా వ్యర్థాలు రహదారులపై చేరడంతో ప్రజలు, వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ బస్టాండ్ ప్రాంతం వర్షపు నీటితో చెరువును తలపిస్తోంది. ఈ వర్షంతో రబీ సీజన్ పంటల సాగుతోపాటు ఉద్యాన పంటలకు మేలు చేకూరుతోందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

●**ఉదయగిరి రూరల్ :** వరికుంటపాడు మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాల్లో ప్రజలు నివాసాలకే పరిమితమయ్యారు. గ్రామాల్లోని రహదారులు, నివాసాల సముదాయాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మెట్ట, ఉద్యాన పంటలకు సానుకూలంగా మారుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పంచాయతీ విభజనకు వ్యతిరేకంగా తీర్మానం

ఉదయగిరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమలాపురం పంచాయతీ విభజనను వ్యతిరేకిస్తూ పాలకవర్గం మంగళవారం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. పంచాయతీని విభజన చేయాలంటూ ఇటీవల పంచాయతీకి చెందిన కొందరు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. దీంతో అధికారులు రెండు పర్యాయాలు పంచాయతీలో గ్రామసభ ఏర్పాటుచేశారు. ఆ సభలకు సభ్యులు ఎవరూ హాజరు కాకపోవడంతో కోరంలేక వాయిదా వేశారు. తాజాగా స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కొల్లుబోయిన కృష్ణ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి నాగూర్‌బీ పాలకవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తొమ్మిది వార్డుసభ్యులు హాజరై విభజనను వ్యతిరేకిస్తూ పంచాయతీ ప్రజలంతా కలిసి ఉంటామని ఏకగ్రీవ తీర్మానం చేశారు.

సేవా పుస్తకాల అందజేత

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మారెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులకు మంగళవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో సేవా పుస్తకాలు అందజేశారు. శాఖ జిల్లా కౌన్సిలర్ ఎస్ హరిశ్చంద్ర ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు పీ మాలకొండయ్య ఆ పుస్తకాలను అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు ఎల్‌వీ నారాయణ, నాయకులు డీ రమణయ్య, జీ హజరత్, పీ మనోహర్, శ్యామల, స్రవంతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి



ఆశ్రమం వద్ద పెన్నానదిని పరిశీలిస్తున్న తహసీల్దారు వెంకటేశ్వర్లు

కలువాయి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సోమశిలకు భారీ వరద హెచ్చరికల నేపథ్యంలో మంగళవారం రాజుపాళెం పరమానంద ఆశ్రమాన్ని తహసీల్దారు డి వెంకటేశ్వర్లు సందర్శించారు. సోమశిల డ్యాంకు కింది వైపున పెన్నానది ఒడ్డున ఉన్న ఆశ్రమానికి వరద తాకిడి ఉండే అవకాశం ఉండటంతో ఆశ్రమ నిర్వాహకులకు ఆయన పలు సూచనలు ఇచ్చారు. ఆశ్రమంలో భక్తులను రాత్రులు బస చేయకుండా పంపించాలని కోరారు. పెన్నానది వైపు ఎవ్వరూ వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు తహసీల్దారు సూచించారు.

పోలీసు అమరవీరులకు ఘన నివాళి



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న పోలీసులు

కలువాయి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక బస్టాండు సెంటర్‌లోని పోలీసు అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. రాపూరు సీఐ ఎన్ సత్యనారాయణ, ఎస్‌ఐ ఎస్ కోటయ్య ఆధ్వర్యంలో పోలీసులు ర్యాలీ నిర్వహించిన అనంతరం అమరవీరుల స్థూపం వద్ద కలువాయికి చెందిన అనకర్ల కేశవులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

కలువాయి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ అధికారులు మంగళవారం తోపుగుంటలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. రైతులకు కొత్తగా ఇచ్చిన యూరియా కార్డుల మీద ఏకరాకు బస్తా వంతున అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కళారాణి, మండల టీడీపీ ఉపాధ్యక్షులు జీ.హరిబాబు, గంగవరపు చంద్రమౌళి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన పాప తల్లిదండ్రులకు అప్పగింత

ఏఎస్‌పేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన పాపను వారి తల్లిదండ్రులకు పోలీసులు అప్పగించారు. వివరాల మేరకు.. మహరాష్ట్ర రాష్ట్రంలోని నాందేడ్‌కు చెందిన దంపతులు మంగళవారం ఏఎస్‌పేట దర్గాకు విచ్చేశారు. ఈ తరుణంలో తమ సుమారు 3సంవత్సరాల వయస్సు గల పాప తప్పిపోయింది. బస్టాండ్ సెంటర్‌లో ఏడుస్తున్న పాపను గుర్తించిన పోలీసులు పాప తల్లిదండ్రుల ఆచూకీ తెలుసుకొని వారిని పోలీస్‌స్టేషన్ పిలిపించి పాపను వారికి అప్పగించారు.

భూగర్భ డ్రైనేజీ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలి : డీఈ



సిబ్బందితో సమీక్షిస్తున్న డీఈ రామకృష్ణ

సీతారామపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సీతారామపురంలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రామకృష్ణ సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లిక్విడ్ వేస్ట్, గ్రేవాటర్ మేనేజ్‌మెంట్ కోసం జిల్లాలో సీతారామపురం గ్రామాన్ని అధికార యంత్రాంగం ప్రతిపాదించిందన్నారు. గ్రామంలో ఎంతవరకు డ్రైనేజీ అవసరం, వర్షపాతం, విలేజ్ లేఅవుట్, మ్యాప్ ద్వారా గ్రామంలో సర్వే చేపట్టి ప్రతిపాదనలు తయారుచేసి ఉన్నతాధికారులకు పంపడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో రఘునాథ్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హనీనిషి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సుమతి, వీఆర్వోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి ఆనం, ఎమ్మెల్యే కాకర్ల పర్యటన

దుత్తలూరు(ఉదయగిరి), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని వింజమూరు, దుత్తలూరు మండలాల్లో బుధవారం రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌లు పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ పొలిటికల్ మేనేజర్ మాలేపాటి చైతన్య మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వారు తొలుత వింజమూరు మండలం గుండెమడగల గ్రామంలో సీతారామస్వామి ఆలయ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అనంతరం దుత్తలూరు మండలం నర్రవాడలో ఉన్న వెంగమాంబ పేరంటాలమ్మతల్లిని దర్శించుకుంటారన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.







శాస్త్రోక్తంగా కేదార గౌరీ వ్రతం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో కేదారగౌరీదేవి వ్రతాన్ని మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీకృష్ణ దేవరాయమండపంలో పార్వతీదేవిని కొలువు దీర్చి వ్రతాన్ని నిర్వహించారు. మహిళా భక్తులు వ్రతంలో పాల్గొని, నోముదారాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బాపిరెడ్డి, డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి, ఏఈవో లోకేష్, సూపరింటెండెంట్ నాగభూషణం, ప్రధాన అర్చకుడు సంబంధం గురుకుల్ తదితరులు పాల్గొన్నారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



సోమ, మంగళవారాల్లో ఒకవైపు వర్షం పడుతున్నా.. మరోవైపు మిరుమిట్లుగొలిపేలా బాణసంచా పేల్చారు. ఉత్సాహంగా దీపావళి పండుగ జరుపుకొన్నారు. కాకుంటే, టపాసుల వ్యాపారం మాత్రం తగ్గింది. ఇళ్ల ముందు దీపాలు వెలిగించారు.

జోరు వాన

- పది మండలాల్లో భారీగా.. మరికొన్ని చోట్ల మోస్తరు
- వడమాలపేటలో చెరువుకు గండి ● కోటలో తెగిపడిన విద్యుత్ తీగలు
- సముద్రంలో వేట నిలిపివేత

ఈశాన్య రుతుపవనాలు.. బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కారణంగా మంగళవారం జిల్లావ్యాప్తంగా వర్షాలు కురిశాయి. పది మండలాల్లో భారీగా.. మరో 14మండలాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. జిల్లావ్యాప్తంగా సగటున 32.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అన్ని చోట్ల చెరువుల్లోకి నీరు చేరుతోంది. వాగులు, వంకలు ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

- వడమాలపేట మండలం లక్ష్మమ్మ కండ్రిగ పంచాయతీ ఎస్టీ కాలనీ కొత్త చెరువుకు సోమవారం మధ్యాహ్నం గండి పడింది. మంగళవారం సాయంత్రానికి గండి పూడ్చారు.
- బాలాయపల్లి మండలం జయంపు చెరువు కలుజు వద్ద కట్ట కోతకు గురైంది. ● భారీ వర్షం, ఈదురుగాలులతో కోటలోని ఆరాధ్య థియేటర్ రోడ్డులో మంగళవారం మధ్యాహ్నం విద్యుత్ తీగలు తెగి పడ్డాయి. అదృష్టవశాత్తూ ఆ సమయంలో జనం లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.
- వాకాడు, కోట మండలాల పరిధిలో అలలు ఎగిసిపడి సముద్రం అల్లకల్లోలంగా మారింది. దీంతో సోమవారం మధ్యాహ్నం నుంచే మత్స్యకారులు చేపల వేట నిలిపివేశారు.
- పెళ్లకూరు మండలం జీలపాటూరు వద్ద ఎల్పి ఫైర్లలో వర్షపు నీరు చేరింది.
- శ్రీకాళహస్తి, నాయుడుపేట వద్ద స్వర్ణముఖి నదిలోకి నీరు చేరుతోంది.
- తిరుపతిలో సోమవారం మోస్తరు వాన పడగా మంగళవారం జడివాన పట్టుకుంది. రోజంతా ఏదో ఒకస్థాయిలో వర్షం పడుతూనే వుంది.


బుచ్చినాయుడు కండ్రిగ మండలం ఆలత్తూరు వద్ద పందికాలువలో నీటి ఉధృతితో రాకపోకలు ఆపేసిన అధికారులు


వడమాలపేట మండలం లక్ష్మమ్మ కండ్రిగ కొత్తచెరువుకు సోమవారం పడిన గండి


ఏర్పేడు మండలం గుడిమల్లం నుంచి భక్తులను సీతకాలువ వద్ద వద్ద ట్రాక్టరులో దాటిస్తున్న ఆలయ నిర్వాహకులు


సూళ్లూరుపేటలోని షార్ వై జంక్షన్ సమీపంలో నివాసాల నడుమ వర్షపునీరు

0877-2236007కు ఫోను చేయండి

వర్షంతో ఏవైనా సమస్యలా? ఎక్కడైనా అత్యవసర పరిస్థితులు ఏర్పడ్డాయా? అయితే కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌కు 0877-2236007 ఫోను చేసి సమాచారం అందించాలి. మండలస్థాయిల్లోనూ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు.


వెంకటగిరి వద్ద కౌవల్యానది ప్రవాహం

వర్షపాతం ఇలా..

జిల్లాలో మంగళవారం నమోదైన వర్షపాతంలో అత్యధికంగా వాకాడులో 104.6మి.మీ. నమోదైంది. సూళ్ళూరుపేట 74.4 మి.మీ, ఓజిలి 62.8, కోట 56.6 , దొరవారిసత్రం 53.8, చిట్టమూరు 53.6, తడ 48.6, తిరుపతి అర్బన్ 43.6, బాలాయపల్లి 43.4, తిరుపతి రూరల్ 41.6, బుచ్చినాయుడుకండ్రిగ 39.4, వడమాలపేట 38.6, వరదయ్యపాళెం 38.2, శ్రీకాళహస్తి 36.8, తొట్టంబేడు 33.4, ఏర్పేడు 33.2, రేణిగుంట 32.4 మి.మీ. చొప్పున వర్షం పడింది. డక్కిలి, పిచ్చాటూరు, చిన్నగొట్టిగల్లు, నారాయణవనం, ఎర్రావారిపాళెం, నాగలాపురం మండలాలు మినహా మిగిలిన చోట్ల ఒక మోస్తరు వర్షం కురిసింది.

- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి


కోటలో తెగిపడిన కరెంటు తీగలు

అధికారులూ.. అప్రమత్తంగా ఉండండి

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో సమావేశమయ్యారు. పోలీసుశాఖ వారు లోతట్టు ప్రాంతాల్లోని చెరువులు, కాజ్‌వేల వద్ద బారికేడ్లను ఏర్పాటు చేసి రెవెన్యూ సిబ్బందితో కలిసి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అంగన్వాడీ, ప్రైమరీ పాఠశాలలకు సంబంధించి శిథిలావస్థ.. పెచ్చులూడుతున్న భవనాలను గుర్తించి అనువైన వాటిల్లోకి మార్చాలన్నారు. మెరుగైన పారిశుధ్యంపై స్థానిక సంస్థల అధికారులు దృష్టి పెట్టాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు మెడికల్ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. డ్రైనేజీలు, కాలువలు, చెరువుగట్లు, వంతెనలు, లోతట్టు ప్రాంతాల వద్ద ప్రమాదాలు సంభవించకుండా చూడాలన్నారు. తిరుపతి కమిషనర్, ఇన్‌ఛార్జి జేసీ మౌర్య, డీఆర్వో నరసింహులు, ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాష్‌రెడ్డి, కిరణ్మయి, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, డీపీవో సుశీలాదేవి, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నిండుకుండలా పులికాట్

నిన్నా మొన్నటి వరకు నీళ్లులేక వెలవెలబోయిన పులికాట్ సరస్సు.. రెండు రోజుల వర్షాలకు నిండుకుండను తలపిస్తోంది. వర్షపు నీటితో పాటు కాళంగి, పాముల కాలువల నుంచి సరస్సుకు భారీగా నీరింది. దీంతో పులికాట్ తీరం వెంబడి సముద్రాన్ని తలపించేలా నీటి అలలు ఎగసిపడుతున్నాయి. మరో రెండురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో మత్స్యకారులు పులికాట్‌లో వేటకు వెళ్లరాదని అధికారులు హెచ్చరికలు జారీచేశారు.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి




సూళ్లూరుపేట జూనియర్ కళాశాల మైదానంలో నీళ్లు చేరడంతో బోసిపోయిన టపాకాయల దుకాణాలు

టపాసుల వ్యాపారానికి వాన దెబ్బ

దీపావళి సందర్భంగా జిల్లాలో టపాసుల వ్యాపారానికి వాన దెబ్బ పడింది. వర్షం పడుతుండటంతో కొనుగోలుదారులు పెద్దగా రాలేదు. తెరపిచ్చినప్పుడు మాత్రం కొందరు వెళ్లి కొనుగోలు చేశారు. ఆయా మైదానాల వద్ద ఏర్పాటు చేసిన టపాసుల అంగళ్లు కళ తప్పాయి.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

స్వర్ణమ్మకు జలకళ

స్వర్ణముఖి నది జలకళ సంతరించుకుంది. మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం కొత్త నీరుచేరింది. కార్తీక మాసం తొలిరోజున పవిత్ర నదిలో జలకళ ఆరంభమైంది.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



జిల్లాకు మరో డయాలసిస్ కేంద్రం

తిరుపతి(వైద్యం), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఉపశమనం కలిగించేలా రాష్ట్ర ప్రభుత్వం మరో డయాలసిస్ కేంద్ర ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. వెంకటగిరిలో ఏర్పాటు కానున్న ఈ కేంద్రంలో రూ.75 లక్షలతో మూడు రక్తశుద్ధి పరికరాలను అందుబాటులోకి తీసుకురానున్నారు.ప్రతిరోజూ మూడు సెషన్లలో 15 మందికి డయాలసిస్ చేయొచ్చు. ఈ కేంద్రం ఏర్పాటు వల్ల ఆప్రాంత బాధితులకు పెద్ద ఉపశమనమనే చెప్పాలి. డయాలసిస్ కోసం దూర ప్రయాణం తగ్గనుంది.

నకిలీ టీటీఈ అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న నకిలీ టీటీఈని రైల్వే పోలీసులు పట్టుకున్నారు. జీఆర్‌పీఎఫ్ సీఐ ఆశీర్వాదం తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం కన్నదాసన్ నగర్‌కు చెందిన జితేంద్ర షా తిరుపతిలో టీటీఈగా అవతారం ఎత్తాడు. రైళ్లలో దిగుతున్న ప్రయాణికులను టార్గెట్‌గా చేసుకుని వసూళ్లకు పాల్పడుతున్నాడు. ఇతడిపై రెండు రోజుల క్రితం అందిన ఫిర్యాదుతో నిఘా పెట్టారు. ఈ క్రమంలో గేటు నెంబరు 3 వద్ద ప్రయాణికుల వాగ్వాదంతో పోలీసులు వెళ్లి విచారించారు. తన వద్ద సరైన టికెట్ లేకపోవడంతో రూ.వెయ్యి జరిమానా వేశారని, తన వద్ద రూ.500 తీసుకుని రసీదు ఇవ్వలేదని ఓ ప్రయాణికుడు చెప్పారు. మిగతా రూ.500 కోసం బెదిరిస్తున్నాడని తెలిపారు. నగదు వసూలు చేసిన వ్యక్తిని పోలీసులు పోలీసులు విచారించగా తాను టికెట్ కలెక్టర్‌నని చెప్పాడు. అతడి వద్ద గుర్తింపు కార్డు లేకపోవడంతో అదుపులోకి తీసుకుని విచారించారు. రైల్వే జీఆర్‌పీఎఫ్ ఎస్ఐ రత్నమాల కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు.

◆ పోలీసు అమర వీరులారా

మీ త్యాగాలు మరువలేం


అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని కలెక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా మంగళవారం తిరుపతిలోని పోలీసు పరేడ్ మైదానంలో అమరవీరుల స్థూపం వద్ద ఎస్పీ సుబ్బరాయుడితో కలిసి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మన భద్రతకు పోలీసు సిబ్బంది రక్షణ కవచం లాంటివారని కొనియాడారు. జిల్లాలో ఇప్పటి వరకు విధి నిర్వహణలో అసువులు బాసిన 25 మంది పోలీసు సిబ్బంది త్యాగాలు చిరస్మరణీయమని ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. వారి త్యాగం వృథా కాదని, వారి కుటుంబాలకు పోలీసు శాఖ అండగా ఉంటుందన్నారు. అమరవీరుల కుటుంబ సభ్యులకు పోలీసు శాఖ తరఫున కలెక్టర్, ఎస్పీ శాలువా కప్పి, జ్ఞాపిక ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచ్చారి, నాగభూషణరావు, ఇంటెలిజెన్సు ఏఎస్పీ రాయుడు, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి

తడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు శరత్‌బాబు అన్నారు. పుదుచ్చేరి కేంద్రంగా అల్పపీడన ప్రభావంతో ఈనెల 25 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

గూడూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం నియోజకవర్గ పరిధిలోని పలువురు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు.

పోలీసులపై ఆరోపణలు సరికాదు: సీఐ

తడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏడు క్రిమినల్ కేసులు ఉన్న వ్యక్తిని బైండోవర్ చేసేందుకు పిలిస్తే, అసత్య ఆరోపణలతో పోలీసులపై నిందలు మోపడం తగదని సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పూడి గ్రామానికి చెందిన పరమశివంరెడ్డిపై పలు నేరాలకు సంబంధించి కేసులు నమోదై ఉండడంతో పాటు తరచూ ఫిర్యాదులు వస్తుండటంతో కేసులు నమోదు చేశామన్నారు. నేరచరిత్ర కలిగిన వ్యక్తిని బైండోవర్ చేసేందుకు పిలిస్తే... పోలీసులు అక్రమంగా కేసులు నమోదు చేస్తున్నారంటూ కొందరు అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. పూర్తి వివరాలు తెలుసుకోకుండా పోలీసులపై ఆరోపణలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిమ్మసాగులో జాగ్రత్తలు పాటించాలి

గూడూరు అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నిమ్మ సాగులో రైతులు జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఉద్యానవనశాఖ అధికా రిణి సునీత అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ నేలకు తాకుతున్న కొమ్మలను కత్తిరించి గాలి, వెలుతురు మొక్కకు సోకేట్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాల తరువాత బొబ్బర తెగులు ఆశించే అవకాశం ఉంటుందని, దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్, స్ట్రెప్టోసైక్లిన్ కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు.

అమరవీరులకు నివాళి

డక్కిలి/వెంకటగిరి: అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అమరులైన పోలీసులకు విద్యార్థులు నివాళులర్పించారు. మంగళవారం సాయంత్రం డక్కిలి కమ్మపల్లి రోడ్డు సెంటరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు పోలీసులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ శివశంకర్, ఎంఈవో జగదీష్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే వెంకటగిరిలోని గురుకుల బాలికల పాఠశాలలో పోలీసు అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఏఎంసీ ఛైర్మన్ పునుగోటి విశ్వనాథ నాయుడు, సీఐ రమణ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

వెంకటగిరి టౌన్, అక్టోబరు 21,(ఆంధ్రజ్యోతి): అమరులైన పోలీసులు త్యాగాలు మరువలేనివని 9వ బెటాలియన్ కమాండెంట్ ఈఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. మంగళవారం మండల పరధిలోని బెటాలియన్‌లో పోలీసు అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. ముందుగా అమరవీరులు ఘాట్ వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు

నాయుడుపేట టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని విజిలెన్స్ ఏవో రామాంజనేయరెడ్డి స్పష్టం చేశారు. పట్టణంలోని విత్తనాల దుకాణాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు, విత్తనాలు సరఫరా చేసే కంపెనీల ధృవీకరణ పత్రాలను పరిశీలించారు. తప్పనిసరిగా రైతులకు బిల్లులు ఇవ్వాలని, అందులో విత్తనం, కంపెనీ పేరు తప్పనిసరిగా పొందు పరచాలన్నారు.

ఒకటో పట్టణ ఎస్ఐగా మనోజ్‌కుమార్

గూడూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఒకటో పట్టణ ఎస్ఐగా మనోజ్‌కుమార్ మంగళవారం బాధ్య తలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న తిరుపతయ్య గూడూరు రూరల్‌కు బదిలీ అయ్యారు.

వైసీపీ హయాంలోనే కక్ష సాధింపు చర్యలు: విజయశ్రీ

సూళ్లూరుపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కక్ష సాధింపులకు పాల్పడి, కేసులు పెట్టి టీడీపీ శ్రేణులతో పాటు ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది వైసీపీ ప్రభుత్వ హయాంలోనేనని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం సాయంత్రం ఆమె మీడియాతో మాట్లాడుతూ తడ మండలం పూడికి చెందిన వైసీపీ సర్పంచ్ పరమశివంరెడ్డిపై 2010నుంచి క్రిమినల్ కేసులు ఉన్నాయని, ఆ విషయం తెలుసుకోకుండా కూటమి ప్రభుత్వంలో కేసులు నమోదు చేస్తున్నారంటూ మాజీ ఎమ్మెల్యే విమర్శించడం దారుణమన్నారు. 2010లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పరమశివంరెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదు చేసిన విషయం తెలియదా అని ప్రశ్నించారు. సొంత పార్టీ నాయకుడిపైనే క్రిమినల్ కేసులు నమోదు చేశారంటే అతని నేర ప్రవృత్తి ఎటువంటిదో అర్థం చేసుకోవాలన్నారు. చెరువు ఆధునికీకరణ పనుల పరిశీలనకు వెళ్లిన ఇరిగేషన్ అధికా రులను, టీడీపీ నేతను అడ్డగించి దాడి చేస్తేనే కేసులు నమోదు చేశారని స్పష్టం చేశారు. సమావేశంలో ఏఎంసీ ఛైర్మన్ ఆకుతోట రమేష్, బెస్త కార్పొరేషన్ ఛైర్మన్ బొమ్మన శ్రీధర్, టీడీపీ నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, బొమ్మన పళణి, సెల్వం, శ్రీనివాసులు నాయుడు, టీకే శ్రీనివాసన్, వేలూరు చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

కాళంగి వంతెనను పరిశీలించిన ఆర్డీవో

దొరవారిసత్రం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని తనియాలి వద్ద కాళంగి నదిపై వంతెనను సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి మంగళవారం పరిశీలించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా కాళంగి నదికి వరద నీరు చేరుతోంది. తనియాలి వంతెనపై నీరు ప్రవాహిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు ఆర్డీవో సూచనలు చేశారు. ఆమె వెంట తహసీల్దారు శైలాకుమారి, ఎస్‌ఐ అజయ్‌కుమార్ ఉన్నారు.

తెగిపడిన విద్యుత్ లైన్

కోట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్‌ఆర్‌టీ థియేటర్ సమీపంలో మంగళవారం విద్యుత్ లైన్ తెగిపడింది. తెల్లవారుజాము నుంచి పట్టణంలో వర్షంతో పాటు గాలులు వీయడంతో సబ్‌స్టేషన్ నుంచి దాదరాయిగుంట మీదుగా కొక్కుపాడు వెళ్లే విద్యుత్ మెయిన్ లైన్ ఆర్‌ఆర్‌టీ థియేటర్ సమీపంలో తెగిపడింది. ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు.









సూళ్లూరుపేట: షార్ రోడ్డులో కాలువలా వర్షపునీరు - పెళ్లకూరు: చిల్లకూరులో పొలాల్లో చేరిన వర్షపు నీరు - కోట: గోవిందపల్లిపాళెం వద్ద సముద్రపు ఒడ్డుకు చేరిన పడవలు, వలలు

విస్తారంగా వర్షాలు

పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకలు

సూళ్లూరుపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. సూళ్లూరుపేట పట్టణంలోని శివారు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కాళంగి నదికి భారీగా నీరు చేరింది. నెర్రికాలువ, ఫుచ్చా కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. స్థానిక హోలిక్రాస్ కూడలి నుంచి రైల్వేస్టేషన్ రోడ్డు వరకు జీఎన్‌టీ రోడ్డుపై వర్షపునీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. శ్రీహరికోటకు వెళ్లే రోడ్డు షార్ వై జంక్షన్ నుంచి గురుకుల పాఠశాల, సాయిబాబ ఆలయం వరకు రోడ్డుపై మోకాళ్లలోతు నీరు నిలవడంతో వాహనదారులకు అవస్థలు తప్పలేదు. పట్టణంలోని సాయినగర్‌ను వర్షపునీరు చుట్టిముట్టింది. అదేవిధంగా వట్రపాలెం, వనంతోపు, గాండ్లవీధి, మున్సిపల్ కార్యాలయం వీధి, ఇసుకమిట్ట, రాజీవ్‌నగర్, కసారెడ్డిపాలెం ప్రాంతాల్లో రోడ్లపై వర్షపునీరు చేరడంతో నివాసాల నడుమ మడుగను తలిపిస్తున్నాయి. తహసీల్దార్ గోపినాథరెడ్డి, మున్సిపల్ కమిషన్ చిన్నయ్య, ఇరిగేషన్ ఏఈ రమేష్ అధికారులతో కలిసి లోతట్టు ప్రాంతాలను పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. సాయినగర్, సూళ్లూరు ప్రాథమిక పాఠశాల, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ గోపినాథ్ రెడ్డి తెలిపారు. ప్రజలకు ఎలాంటి అవసరమొచ్చినా 08623 244122, 9849904074 నెంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

దొరవారిసత్రం: మండలంలో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 94.6 మి.మీ వర్షపాతం నమోదైంది. చెరువులు, కుంటలు, కాలువల్లో నీరు చేరింది. కల్లూరుకండ్రిగ వద్ద పేట - వాకాడు ఆర్‌అండ్‌బీ రహదారి, తనియాలిలోని ఆర్‌అండ్‌బీ రహదారిపై గోతుల్లో వరదనీరు చేరడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నాయి.

నాయుడుపేట టౌన్: మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. స్వర్ణముఖినదికి జలకళ సంతరించుకుంది. నాయుడుపేట - వెంకటగిరి పాత రహదారి గుంతల మయంగా మారడంతో రాకపోకలు స్తంభించాయి.

కల్లోల భరితంగా సముద్రం

కోట: మండలంలో కురుస్తున్న వర్షాలకు సముద్రం కల్లోల భరితంగా మారింది. అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతుండటంతో మత్స్యకారులు చేపల వేట ఆపేశారు. మండంలోని చెరువుల్లో వర్షపునీరు నిల్వచేరుతోంది. అదేవిధంగా స్వర్ణముఖినదిలోకి స్వల్పంగా వరదనీరు చేరింది. స్వర్ణముఖి ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు వస్తుండటంతో గూడలి వద్ద నుంచి మామిడి కాలువ, చల్లకాలువ పారుతోంది. గూడలి స్వర్ణముఖినది నుంచి వాకాడు బ్యారేజీలోకి వరదనీరు భారీగా వెళ్తోంది.

వెంకటగిరి టౌన్: అల్పపీడన దోరణి కారణంగా గత రెండు రోజులుగా ఎడతెరపిలేని వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం సాయంత్రం వరకు ఆగకుండా వర్షం పడుతుంది. మండలంలోని నాలుగు చెరువులు 25శాతం నిండాయని అధికారులు తెలిపారు. వెలుగొండల అడవుల్లో నుంచి వచ్చే వర్షపు నీటితో కౌవల్యానది నిండుకుండలా ప్రవహిస్తోంది. మరో రెండు రోజులుగా పాటు వర్షాలు కురవనుండడంతో పట్టణంలోని సవారిగుంట, కౌవల్యానది ఒడ్డు ప్రవాహక ప్రాంతం, కాంపాళెం గోడ్డేవాగు పరిసర ప్రాంతాల్లో స్థానికులను అధికారులు అప్రమత్తం చేశారు.

బాలాయపల్లి: మండలంలో సోమవారం అర్ధరాత్రి నుండి ఎడతెరిపి లేని వర్షం కురుస్తుంది. వాగులు, కాలువలు నీటితో నిండాయి. జయంపు గ్రామంలోని చెరువుకట్ట కలుజు కోతకు గురైంది. ఏఈ వెంకటేశ్వర్లు, వీఆర్‌వో చైతన్య ఉన్నతాదికారులకు సమాచారం అందించారు. గండి పడితే చెరువులో నీరు ఇళ్లపైకి వచ్చే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. వర్షాలకు చెరువులు దెబ్బతినకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు,

గూడూరు: పట్టణంలో మంగళవారం మోస్తరు వర్షం కురిసింది. విడతల వారీగా జల్లులు కురుస్తుండడంతో స్థానిక ఏపీరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో నీరు నిల్వచేరింది. పట్టణంలోని ప్రధాన రహదారులపై నీరు చేరడంతో పాదాచారులు, వాహనదారులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడ్డారు.

ఓజిలి: రెండు రోజులుగా ఎడతెరిపి లేని వర్షం కారణంగా మండలంలో జనజీవనం స్థంభించింది. వాగులు, వంకలు, దొరువులు ప్రవాహిన్నాయి. కరబల్లవోలు సచివాలయం జల దిగ్బంధంలో ఉంది.

పెళ్లకూరు: మండలంలో కుండపోత వర్షం కురుస్తోంది. మంగళవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. మండలంలోని అన్ని చెరువులకు వరదనీరు వచ్చి చేరుతోంది.

చిట్టమూరు: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చిట్టమూరు తహసీల్దార్ నరేష్ కోరారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. భారీ వర్షాల వల్ల వరదలు సంభవిస్తే లోతట్టు గ్రామాల ప్రజలను సురక్షితమైన ప్రాంతాలకు చేర్చాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో చిట్టమూరులో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంకు సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో డీటీ నిరంజన్ కుమార్, ఆర్‌ఐ సుధ, మధులత, వీఆర్వోలు పాల్గొన్నారు.





